


రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజానుకూల విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక ఎన్నికల ఫలితాలే తిరుగులేని నిదర్శనం. ముఖ్యమంత్రి చంద్రబాబు సుపరిపాలన, నారా లోకేష్ విద్య, ఉపాధి సంస్కరణలపై ప్రజలు సంపూర్ణ విశ్వాసం చాటారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



సోమవారం 16.11.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 205 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00




# మురసు దెబ్బ.. రూ.2,484 కోట్ల నష్టం

## 1.86 లక్షల మంది రైతులకు తీవ్ర నష్టం

## 1.43 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్న వైనం

## ఉద్యాన పంటలకూ భారీ నష్టం

## కేంద్ర సాయం కోసం చంద్రబాబు విజ్ఞప్తి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మురసు తుఫాన్‌తో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆదివారం వర్చువల్‌గా సమావేశమైంది. క్షేత్రస్థాయిలో పరిశీలించిన నష్ట వివరాలను బృందం ముఖ్యమంత్రికి వివరించగా, రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలు, పునరుద్ధరణ పనుల గురించి చంద్రబాబు వెల్లడించారు.

కేంద్ర హోం శాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల బృందం రెండు బృందాలుగా విడిపోయి బాపట్ల, పల్నాడు, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించింది. దాదాపు 60 ప్రాంతాల్లో దెబ్బతిన్న పంట పొలాలు, కాలువలు, రహదారులు, ఇళ్లు, విద్యుత్ వ్యవస్థలను పరిశీలించింది. భీమడోలు మండలం సూరప్పగూడెంలో రైతులతో మాట్లాడి పంట నష్టాన్ని తెలుసుకుంది. చీరాలలో మత్స్యకారుల పడవలకు జరిగిన నష్టాన్ని, బొప్పూడిలో పక్కా ఇళ్లు, ఉద్యాన పంటలు, వ్యవసాయం, బాతుల పెంపకానికి జరిగిన నష్టాన్ని పరిశీలించింది.

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావానికి తోడు ఒకేసారి రెండు తుఫాన్లు రావడంతో రాష్ట్రానికి భారీ నష్టం వాటిల్లిందన్నారు. తుఫాన్ గమనాన్ని ముందుగానే అంచనా వేసి సహాయక చర్యలు చేపట్టామని, తుఫాన్ అనంతరం యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు నిర్వహించామని తెలిపారు. రహదారులు, విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్ వంటి సేవలను 24 గంటల్లోనే పునరుద్ధరించగలిగామని చెప్పారు. ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తీసుకొచ్చామని, పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. బాధితులకు అదనపు రేషన్ కూడా అందించినట్లు తెలిపారు.


కోస్తాంధ్ర తరచూ తుఫాన్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో భవిష్యత్తులో నష్టాన్ని తగ్గించేందుకు మౌలిక సదుపాయాలను మరింత పటిష్టంగా నిర్మించాల్సిన అవసరం ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. కేంద్ర బృందం పది రోజుల్లో నష్టంపై నివేదిక సమర్పించి, తక్షణమే తుఫాన్ సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



క్షేత్రస్థాయి పరిశీలనలో గ్రామీణ రహదారులు ఫ్లాష్ ఫ్లడ్స్ కారణంగా తీవ్రంగా దెబ్బతిన్నాయని, విద్యుత్ స్తంభాలు

2 లో..

# గడపగడపకూ ఆరోగ్య పరీక్ష.. గుట్టువిప్పిన సర్వే



**అమరావతి, నవంబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో జీవనశైలి వ్యాధుల తీవ్రత ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఎన్‌సీడీ 4.0 సర్వేలో 59.63 లక్షల మందికి అధిక రక్తపోటు (బీపీ), 48.95 లక్షల మందికి మధుమేహం ఉన్నట్లు వెల్లడైంది. వీరిలో సుమారు 34 లక్షల మంది రెండు వ్యాధులతో బాధపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. కొత్తగా 12,23,185 మందికి బీపీ, 11,58,632 మందికి మధుమేహం ఉన్నట్లు నిర్ధారించారు.

రాష్ట్రంలోని 18 ఏళ్లు పైబడిన జనాభాలో 13.93 శాతం మందికి బీపీ, 11.45 శాతం మందికి మధుమేహం ఉన్నట్లు సర్వే వెల్లడించింది. వయస్సుల వారీగా చూస్తే 60 ఏళ్లు పైబడిన వారిలో ఈ వ్యాధుల ప్రభావం అధికంగా ఉంది. మొత్తం బీపీ కేసుల్లో 47.60 శాతం, మధుమేహం కేసుల్లో 43.39 శాతం ఈ వయస్సు వారే ఉన్నారు. 50-59 ఏళ్ల మధ్య వయస్సు వారిలోనూ బాధితుల సంఖ్య

**2.86 కోట్ల మందికి వైద్య పరీక్షలు**

**59.63 లక్షల మందికి బీపీ..**
**48.95 లక్షల మందికి షుగర్**

**34 లక్షల మందికి రెండు వ్యాధులు..**

**12,768 క్యాన్సర్ కేసుల గుర్తింపు**

2 లో



## చరిత్ర సృష్టించిన స్పేస్‌ఎక్స్

- కక్ష్య నుంచి వచ్చిన స్టార్‌షిప్‌ను గాల్లోనే పట్టుకున్న 'చాప్‌స్టిక్స్'
- 22 గంటల అంతరిక్ష ప్రయాణం.. 14 సార్లు భూ ప్రదక్షిణలు
- 26 స్టార్‌లింక్ ఉపగ్రహాల విజయవంతమైన ప్రయోగం
- పునర్వినియోగ రాకెట్ల లక్ష్యంలో మరో కీలక మైలురాయి

2 లో

# మావోల హింసతో ఆదివాసీలకు నష్టం

- గిరిజనుల హక్కులను గత పాలకులు కాలరాశారు
- నక్సలిజం నిర్మూలనతో గిరిజన ప్రాంతాల్లో కొత్త ఆశలు
- బిర్సా ముండా జయంతి సందర్భంగా ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- రూ.3 వేల కోట్లతో 246 అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం

**గడ్చిరోలి (జర్నలిస్ట్ ఫైల్) :** మావోయిస్టులు, నక్సలైట్ల హింసాకాండతో అత్యధికంగా నష్టపోయింది ఆదివాసీ సమాజమేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దశాబ్దాల పాటు గిరిజనుల సంక్షేమాన్ని గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. నక్సలైట్లు గిరిజనుల హక్కులను కాలరాయడంతో పాటు, కనీసం ఓటు హక్కును కూడా వినియోగించుకోనివ్వకుండా అడ్డుకున్నా అప్పటి పాలకులు ప్రేక్షకపాత్ర వహించారని మండిపడ్డారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా 151వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం మహారాష్ట్రలోని గడ్చిరోలిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా రూ.3 వేల కోట్ల విలువైన 246 అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



చేశారు.

**గిరిజనుల జీవితాల్లో కొత్త వెలుగులు :** 2014లో దేశంలోని దాదాపు 125 జిల్లాలు మావోయిజం, నక్సలిజం ప్రభావంతో అల్లాడిపోయాయని మోదీ గుర్తుచేశారు. ఏటా వందలాది హింసాత్మక ఘటనలు చోటుచేసుకుని వేలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. వీరిలో అత్యధికులు ఆదివాసీలేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు గిరిజనుల హక్కుల హరణాన్ని పట్టించుకోలేదని, వారి కష్టాలను గాలికొదిలేశాయని విమర్శించారు. ప్రస్తుతం నక్సలిజం, మావోయిజం ప్రభావం తగ్గడంతో గిరిజన ప్రాంతాల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయని చెప్పారు. కొద్ది రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో భద్రతా బలగాలతో మిగతా 2లో...

## రాష్ట్రానికి తుపాను ముప్పు



- కళింగపట్నం మినహా అన్ని పోర్టులకు ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రానికి మరో తుపాను ముప్పు పొంచి ఉంది. ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం క్రమంగా బలపడుతూ తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 17వ తేదీ సాయంత్రానికి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందవచ్చని అంచనా వేసింది. అనంతరం మరింత బలపడి రాష్ట్ర తీరం వైపు కదిలే అవకాశముందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో కళింగపట్నం మినహా రాష్ట్రంలోని అన్ని పోర్టులకు ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

**ఉత్తర దిశగా కదులుతున్న వాయుగుండం :** ప్రస్తుతం బంగాళాఖాతంలో కొనసాగుతున్న మిగతా 2లో...

## మలి విడత పురపోరుకు కూటమి కసరత్తు పూర్తి



- మేయర్, చైర్మన్ స్థానాలకు అభ్యర్థుల ఖరారు
- 23 పట్టణ స్థానిక సంస్థల్లో ఈ నెల 26న ఎన్నికలు
- జనసేనకు 5.. భాజపాకు 3 స్థానాలు
- మిగిలిన చోట్ల తెదేపా అభ్యర్థులు బరిలోకి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణ పీఠాలపై కూటమి జెండా ఎగురవేయడమే లక్ష్యంగా మూడు పార్టీల అధినేతలు అభ్యర్థుల ఎంపికను కొలిక్కితెచ్చారు. మలి విడత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో మేయర్, మున్సిపల్ చైర్మన్ స్థానాలను దక్కించుకునేందుకు వ్యూహాత్మకంగా అభ్యర్థులను ఖరారు చేశారు. ఈ నెల 26న జరగనున్న 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కసరత్తు పూర్తి చేశారు. పొత్తులో భాగంగా జనసేనకు రెండు కార్పొరేషన్లు, మూడు మున్సిపాలిటీలు, భాజపాకు ఒక కార్పొరేషన్, రెండు మున్సిపల్ చైర్మన్ స్థానాలు కేటాయించారు. మిగిలిన స్థానాల్లో తెదేపా అభ్యర్థులు పోటీ చేయనున్నారు. మిగతా 2లో...

## డిసెంబరులో పార్లమెంటు సమావేశాలు

- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై సర్కారు దృష్టి
- లోక్‌సభ స్థానాల సంఖ్య 850కి పెంపునకు యోచన
- డీలిమిటేషన్ బిల్లుకు మూడింట రెండొంతుల మెజార్టీ అవసరం
- ఎస్ఐఆర్‌పై ఆందోళనలకు విపక్షాల సన్నద్ధం

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబరు మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. మహిళా రిజర్వేషన్ల అమలుతో ముడిపడి ఉన్న లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేయడమే ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యంగా కనిపిస్తోంది. వచ్చే నెల తొలివారమే సమావేశాల నిర్వహణకు అనువైన సమయమని ప్రభుత్వం భావిస్తున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం.



**850కి లోక్‌సభ స్థానాల పెంపు! :** వచ్చే సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపట్టి లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతమున్న 543 నుంచి గరిష్ఠంగా 850కి పెంచాలని యోచిస్తోంది. ఈ ప్రతిపాదనకు చట్టబద్ధత కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లులపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**విపక్షాల నుంచి ఎస్ఐఆర్ సెగ :** మరోవైపు ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై విపక్షాలు మిగతా 2లో...

## విజయ పరంపర కొనసాగించాలి



- సర్పంచ్ ఎన్నికలకు సమాయత్తం కావాలి
- సమష్టి కృషితో భారీ మెజార్టీ సాధించాలి
- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి
- నాయకులు, కార్యకర్తలకు అచ్చెన్నాయుడు పిలుపు

2 లో

**నిమ్మాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఇటీవల జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో సాధించిన అఖండ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని, మరికొద్ది రోజుల్లో జరగనున్న గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు

## మురసు దెబ్బ.. రూ.2,484 కోట్ల నష్టం



(మొదటి పేజీ తరువాయి)

కూడా నేలకొరిగాయని కేంద్ర బృందం వెల్లడించింది. పత్తి వంటి వాణిజ్య పంటలకు బీమా ప్రీమియం అధికంగా ఉండటంతో పలువురు రైతులు బీమా చేయించుకోలేదని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా కాలువలు, వాగుల్లో పూడికతీత చేపట్టడం వల్ల నష్టం కొంతవరకు తగ్గిందని అభిప్రాయపడింది.

తుఫాన్‌తో దెబ్బతిన్న కచ్చా ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను ఆదుకోవాలని, 30 రోజుల్లో మూడుసార్లు రేషన్ అందించే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర బృందం సూచించింది. ఆదిమ గిరిజనులపై తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉందని, వారికి ప్రత్యేక సహాయం అందించాలని పేర్కొంది. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ పంటలు సాగు చేస్తూ నష్టపోయిన రైతులకు అధిక పరిహారం అందించే అంశాన్ని పరిశీలించాలని తెలిపింది. తూర్పుగోదావరి జిల్లాలో వరి పంటకు 80 శాతం, ఏలూరు జిల్లాలో 90 శాతం వరకు నష్టం వాటిల్లినట్లు బృందం అంచనా వేసింది. మామిడి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని వెల్లడించింది.

రాష్ట్ర ప్రభుత్వ అంచనాల ప్రకారం మురసు తుఫాన్ కారణంగా మొత్తం రూ. 2,484.43 కోట్ల నష్టం వాటిల్లింది. ఇందులో 1,385 కిలోమీటర్ల రహదారులు, 36 చోట్ల గండ్లు, 65 కల్వర్టులు దెబ్బతినడంతో రూ. 888.84 కోట్ల నష్టం సంభవించింది. 1,43,617 హెక్టార్లలో పంటలు దెబ్బతిని రూ. 874.97 కోట్ల నష్టం వాటిల్లగా, 1,86,063 మంది రైతులు ప్రభావితమయ్యారు. మరో 6,756 హెక్టార్లలో ఉద్యాన పంటలకు రూ. 337.10 కోట్ల నష్టం వాటిల్లింది. దీంతో 12,605 మంది రైతులు నష్టపోయారు.

తుఫాన్ ప్రభావంతో 369 సాగునీటి వనరులు, 509 చోట్ల గండ్లు దెబ్బతిన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 220 కిలోమీటర్ల మేర 114 రహదారులు దెబ్బతిన్నాయి. 10,192 పదకొండు కేవీ విద్యుత్ స్తంభాలు, 6,442 ఎల్‌టీ స్తంభాలు, 1,448 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. అత్యవసర సహాయక చర్యల కోసం రూ. 37 కోట్ల వ్యయం చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం నివేదికలో పేర్కొంది. మొత్తం 3,859 ఇళ్లు దెబ్బతినగా, వాటిలో 645 గుడిసెలు ఉన్నట్లు తెలిపింది. వైద్య ఆరోగ్యం, మత్స్య, పురపాలక, మహిళా శిశు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, తాగునీరు, విద్య, పశుసంవర్ధక, చేనేత తదితర రంగాలకు కూడా నష్టం వాటిల్లినట్లు వివరించింది.

## గడపగడపకూ ఆరోగ్య పరీక్ష.. గుట్టువిప్పిన సర్వే



(మొదటి పేజీ తరువాయి)

గణనీయంగా నమోదైంది.

సర్వేలో భాగంగా 3,339 నోటి క్యాన్సర్, 5,832 రొమ్ము క్యాన్సర్, 3,597 గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు గుర్తించారు. మొత్తంగా 12,768 క్యాన్సర్ కేసులు వెలుగులోకి వచ్చాయి. నోటి క్యాన్సర్ అనుమానితుల్లో 23,009 మందిని ఉన్నత వైద్యశాలలకు పంపగా, 3,339 మందికి వ్యాధి నిర్ధారణ అయింది. రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అనుమానితులకు కూడా తదుపరి వైద్య పరీక్షలు నిర్వహించి కేసులను నిర్ధారించారు.

జిల్లాల వారీగా బీపీ కేసుల్లో తూర్పుగోదావరి, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, కాకినాడ, ఏలూరు జిల్లాలు ముందున్నాయి. మధుమేహం కేసుల్లో తూర్పుగోదావరి, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, వైఎస్సార్ కడప, ఏలూరు జిల్లాల్లో అధిక సంఖ్య నమోదైంది. కొత్తగా గుర్తించిన కేసుల్లో విశాఖపట్నం, పశ్చిమగోదావరి, తిరుపతి జిల్లాలు బీపీ, మధుమేహం రెండింటిలోనూ అధిక సంఖ్యలో ఉన్నాయి.

గత ఏడాది సెప్టెంబర్ 17న విశాఖపట్నంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన ఈ సర్వే నవంబర్ 10తో ముగిసింది. గ్రామ, వార్డు స్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ అధికారులు ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య వివరాల నమోదు, పర్యవేక్షణకు ప్రత్యేక డిజిటల్ యాప్‌లు వినియోగించారు. సుమారు 40 వేల మంది ఆశా కార్యకర్తలు, 22 వేల మందికి పైగా ఇతర వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

సర్వే ఫలితాలను కుటుంబ సంక్షేమ కమిషనర్, ఎన్‌హెచ్ఎం ఎండీ కె.వి.ఎన్. చక్రధర్ బాబు, రాష్ట్ర నోడల్ అధికారి శ్యామల వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు నివేదించారు. జీవనశైలి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. బీపీ, మధుమేహం, క్యాన్సర్ బాధితులకు అవసరమైన వైద్య సేవలు, మందులను ఉచితంగా అందిస్తున్నామని వెల్లడించారు.

## మావోల హింసతో ఆదివాసీలకు నష్టం

(మొదటి పేజీ తరువాయి)

కలిసి దీపావళి జరుపుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఒకప్పుడు ప్రజలు వెళ్లాలంటేనే భయపడే ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి వెలుగులు కనిపిస్తున్నాయని అన్నారు.

**గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం :** దశాబ్దాలుగా కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోని గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ప్రధాని తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రగతి కోసం రూ.లక్ష కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. గిరిజన సమాజం ఎప్పుడూ అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిందని కొనియాడారు. దేశంలో 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడం స్వాతంత్ర్యానంతరం భారత్ సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటని పేర్కొన్నారు.

**జాతీయ వేడుకగా జనజాతీయ గౌరవ్ దివస్ :** భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని ఏటా నవంబర్ 15న నిర్వహించే జనజాతీయ గౌరవ్ దివస్ ఇప్పుడు జాతీయ వేడుకగా మారిందని మోదీ అన్నారు. 2021 నవంబర్ 15 నుంచి ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతేడాది బిర్సా ముండా జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా రెండు లక్షలకు పైగా కార్యక్రమాలు నిర్వహించగా, కోట్లాది మంది పాల్గొన్నారని చెప్పారు. గతంలో పండుగలు, ప్రత్యేక సందర్భాలను విదేశీ దృక్కోణంతో నిర్ణయించేవారని, ఇప్పుడు భారతదేశం తన వారసత్వాన్ని, చరిత్రను, వీరులను స్వదేశీ గర్వంతో స్మరించుకుంటోందని పేర్కొన్నారు. ఇది దేశ జాతీయ చైతన్యంలో వస్తున్న గొప్ప మార్పునకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.

1875లో గిరిజన కుటుంబంలో జన్మించిన బిర్సా ముండా బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా గిరిజనుల పోరాటానికి నాయకత్వం వహించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని ప్రధాని గుర్తుచేశారు.

# చరిత్ర సృష్టించిన స్పేస్‌ఎక్స్



**టెక్సాస్:** అంతరిక్ష ప్రయోగాల చరిత్రలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్.. లక్ష్యాన్ని చేరుకుని తిరిగి భూమికి చేరింది. అయితే ఈసారి ప్రత్యేకత ఏమిటంటే.. సముద్రంలోనో, నేలపైనో దిగలేదు. ఏకంగా లాంచ్ టవర్‌కు అమర్చిన భారీ యాంత్రిక చేతులే దాన్ని గాల్లోనే ఒడిసిపట్టుకున్నాయి. అంతరిక్ష ప్రయాణం నుంచి తిరిగొచ్చిన స్టార్‌షిప్ అప్పర్ స్టేజ్‌ను స్పేస్‌ఎక్స్ విజయవంతంగా పట్టుకోవడంతో ప్రపంచ అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర నమోదైంది. పూర్తిస్థాయిలో పునర్వినియోగించగల రాకెట్ల తయారీ దిశగా సంస్థ మరో కీలక అడుగు వేసింది.

**గాల్లోనే ఒడిసిపట్టిన 'చాప్‌స్టిక్స్' :** భారత కాలమానం ప్రకారం ఈరోజు తెల్లవారుజామున 2.52 గంటలకు 'షిప్ 42'గా పిలిచే స్టార్‌షిప్ వ్యోమనౌక టెక్సాస్‌లోని స్టార్‌బేస్ లాంచ్ టవర్ వద్దకు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన రెండు భారీ యాంత్రిక చేతులు.. 'చాప్‌స్టిక్స్' సాయంతో దాన్ని గాల్లోనే సురక్షితంగా పట్టుకున్నాయి. నవంబరు 14న దక్షిణ టెక్సాస్‌లోని స్టార్‌బేస్ నుంచి నింగిలోకి ఎగిసిన ఈ వ్యోమనౌక.. భూమికి సుమారు 275 కిలోమీటర్ల ఎత్తులోని నిమ్న భూ కక్ష్యలోకి చేరింది. అక్కడ 22 గంటలకు పైగా ప్రయాణించి తిరుగు ప్రయాణం ప్రారంభించింది.

**14 సార్లు భూ ప్రదక్షిణలు :** స్టార్‌షిప్ తన 15వ సమగ్ర ప్రయోగ పరీక్షలో భాగంగా భూమి చుట్టూ దాదాపు 14 సార్లు ప్రదక్షిణలు చేసింది. ఈ క్రమంలో 26 నెక్స్ట్ జనరేషన్ స్టార్‌లింక్ ఎ3 ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. వ్యోమనౌకతో పాటు పంపిన మరో మూడు ఉపగ్రహాలు.. దాని హీట్ షీల్డ్, ఇతర కీలక భాగాలను పరిశీలించాయి. తిరిగి భూ వాతావరణంలోకి ప్రవేశించే సమయంలో నౌక పనితీరును అంచనా వేయడానికి ఈ పరిశీలనలు ఉపయోగపడ్డాయి.

**ఇంజిన్ల మండింపుతో తిరుగు ప్రయాణం :** అవసరమైన తనిఖీలు పూర్తయ్యాక స్టార్‌షిప్ తన ఇంజిన్లను మండించి డీ-ఆర్బిట్ ప్రక్రియను ప్రారంభించింది. అనంతరం భూ వాతావరణంలోకి ప్రవేశిస్తూ వేగాన్ని నియంత్రించుకుంది. నిర్దేశిత మార్గంలో ప్రయాణించి స్టార్‌బేస్ లాంచ్ టవర్ వద్దకు చేరుకుంది. అక్కడి భారీ యాంత్రిక చేతులు వ్యోమనౌకను కచ్చితంగా పట్టుకుని లాంచ్ ప్యాడ్ పైన గాల్లో నిలిపాయి.

**పునర్వినియోగంలో కీలక ముందడుగు :** ఇప్పటివరకు స్పేస్‌ఎక్స్ తన సూపర్ హెవీ బూస్టర్లను విజయవంతంగా తిరిగి రాబట్టి పట్టుకున్నప్పటికీ.. కక్ష్య నుంచి తిరిగొచ్చిన స్టార్‌షిప్ అప్పర్ స్టేజ్‌ను లాంచ్ టవర్ చేతులతో పట్టుకోవడం ఇదే తొలిసారి. రాకెట్‌లోని బూస్టర్, అప్పర్ స్టేజ్ రెండు భాగాలనూ తిరిగి రాబట్టి, తనిఖీ చేసి మళ్లీ ప్రయోగాలకు ఉపయోగించాలన్నది సంస్థ లక్ష్యం.

ఈ ప్రయోగంలో రెండు భాగాలనూ పట్టుకోవాలని తొలుత భావించారు. అయితే చివరి నిమిషంలో సూపర్ హెవీ బూస్టర్‌ను పట్టుకునే ప్రయత్నాన్ని రద్దు చేశారు. అది గల్ఫ్ ఆఫ్ మెక్సికోలోని సముద్రంలో సురక్షితంగా దిగింది. అయినప్పటికీ స్టార్‌షిప్ అప్పర్ స్టేజ్‌ను విజయవంతంగా పట్టుకోవడంతో ఈ ప్రయోగం కీలక విజయాన్ని అందుకుంది.

**చంద్రుడు.. అంగారకుడే లక్ష్యం! :** రాకెట్లను పదేపదే ఉపయోగించగలిగితే అంతరిక్ష ప్రయోగాల వ్యయం భారీగా తగ్గుతుంది. ప్రయోగాల మధ్య సమయాన్ని కూడా గణనీయంగా కుదించవచ్చు. భవిష్యత్తులో చంద్రుడు, అంగారకుడిపైకి మానవ సహిత యాత్రలు చేపట్టాలన్న స్పేస్‌ఎక్స్ లక్ష్యానికి ఈ విజయం మరింత బలాన్నివ్వనుంది. అంతరిక్ష ప్రయాణాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావడంలో ఇది కీలక మలుపుగా నిలవనుంది.

## మలి విడత పురపోరుకు కూటమి కసరత్తు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

**తెదేపా అభ్యర్థులు వీరే :** మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా పేరం ఏడుకొండలును తెదేపా ఖరారు చేసింది. మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థులుగా తణుకు నుంచి బసవ రామకృష్ణ, పాలకొల్లు నుంచి ఆబోతుల ఉషారాణి, నరసరావుపేట నుంచి ఎన్.రూపేశ్ గుప్తా, గుడివాడ నుంచి మారీదు కరుణ, శ్రీకాళహస్తి నుంచి పేట బాలాజీని ఎంపిక చేసింది. తాడిగడప నుంచి పీతా గోపీచంద్, పొన్నూరు నుంచి కంద్రు విజయలక్ష్మి, కందుకూరు నుంచి పిడికిటి వెంకటేశ్వర్లు, ఆమదాలవలస నుంచి కూన ప్రమీల, గూడూరు నుంచి చౌటూరి శిరీష పోటీ చేయనున్నారు. నగర పంచాయతీల విషయానికొస్తే చింతలపూడి నుంచి కె.ఎస్తేర్ రాణి, పొదిలి నుంచి వరికుంట్ల అనిల్‌కుమార్, అల్లూరు నుంచి తోటకూర సునీల్‌కుమార్, బి.కొత్తపేట నుంచి కుడుము శ్రీనివాసులు ఛైర్మన్ అభ్యర్థులుగా బరిలోకి దిగనున్నారు.

**జనసేనకు ఐదు స్థానాలు :** జనసేన తరఫున రెండు కార్పొరేషన్లు, మూడు మున్సిపాలిటీలకు అభ్యర్థులను పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఖరారు



చేశారు. శ్రీకాకుళం కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా డా.దానేటి రాధారాణి, కాకినాడ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా ఆకుల భవానిని ఎంపిక చేశారు. రాజాం మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా బనిశెట్టి సౌజన్యలత, భీమవరం నుంచి డా.చుండూరి మల్లేశ్వరి, తాడేపల్లిగూడెం నుంచి పాలూరు వెంకటేశ్వరరావు పోటీ చేయనున్నారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది.

**భాజపా అభ్యర్థుల ప్రకటన :** భాజపా రాష్ట్ర ఎన్నికల కమిటీ మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల జాబితాను ఖరారు చేసింది. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా రేలంగి శ్రీదేవిని ఎంపిక చేసింది. మున్సిపల్ ఛైర్మన్ స్థానాలకు కావలి నుంచి గుండ్లపల్లి భరత్‌కుమార్, బాపట్ల నుంచి ఇస్కా సునీల్‌కుమార్ పేర్లను ఖరారు చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ పేర్లను అధికారికంగా ప్రకటించారు.

## విజయ పరంపర కొనసాగించాలి

(మొదటి పేజీ తరువాయి)



పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి నాలుగు మండలాల పరిధిలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

**సంక్షేమ, అభివృద్ధి పాలనకు ప్రజల మద్దతు :** ఇటీవల జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు అఖండ విజయాన్ని కట్టబెట్టారని మంత్రి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపారని, 94 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయంతో ప్రజలు తమ విశ్వాసాన్ని చాటారని అన్నారు. ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు మెరుగైన వసతులు అందించడం, పార్టీనిక్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రజలకు వివరించాలని నాయకులకు సూచించారు.

**సర్పంచ్ ఎన్నికల్లోనూ విజయమే లక్ష్యంగా పనిచేయాలి :** జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపాయని మంత్రి అన్నారు. అదే ఉత్సాహం, పట్టుదలతో రానున్న సర్పంచ్ ఎన్నికల్లోనూ ప్రతి గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్‌గా పోటీ చేసే అభ్యర్థి ఎవరైనా సరే, వారి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో ముందుకు సాగుతూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని, సర్పంచ్ ఎన్నికల్లోనూ భారీ మెజార్టీతో విజయం సాధించే దిశగా శక్తివంచన లేకుండా కృషి చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం చేశారు.

**నిమ్మాడ క్యాంపు కార్యాలయానికి పోటెత్తిన ప్రజలు :** జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో సాధించిన విజయోత్సాహాన్ని పంచుకునేందుకు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో నిమ్మాడ క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. గ్రామగ్రామం నుంచి వచ్చిన పార్టీ శ్రేణులు తమ ప్రాంతాల్లో సాధించిన విజయాలను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ప్రజలు అందించిన మద్దతు, విజయంతో తమలో మరింత ఉత్సాహం నింపిందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ రానున్న సర్పంచ్ ఎన్నికల్లోనూ సమష్టిగా పనిచేసి విజయాలు సాధించాలని మంత్రి నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

ఈ కార్యక్రమంలో పోలాకి చంద్రశేఖర్ రావు, కృష్ణ, ఎల్.ఎల్. నాయుడు, ఆసిరి నాయుడు, దండాసి తదితర నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

- **పీవీఎన్ మాధవ్**
- **43వ డివిజన్ కార్పొరేటర్ రంగావజ్జుల గాయత్రికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి సూచన**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** కార్పొరేషన్ ఎన్నికల్లో 43వ డివిజన్ కార్పొరేటర్‌గా ఘన విజయం సాధించిన రంగావజ్జుల గాయత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను రాష్ట్ర పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాధవ్‌కు మిఠాయి తినిపించి, శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గాయత్రిని మాధవ్ శాలువాతో సత్కరించి అభినందించారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ డివిజన్‌లో ప్రజలతో మమేకమై వారి సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించాలని సూచించారు. మౌలిక సదుపాయాల కల్పనకు, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

రంగావజ్జుల గాయత్రి మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించిన పీవీఎన్ మాధవ్, సంఘటనా మంత్రి మధుకర్, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావుకు కృతజ్ఞతలు తెలిపారు. తన విజయానికి సహకరించిన కూటమి నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు.

డివిజన్‌లోని ప్రతి సమస్యను మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, కార్పొరేషన్ అధికారుల సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తానని గాయత్రి తెలిపారు. ప్రజల మన్ననలు పొందుతూ 43వ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలపాటి రవికుమార్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి హరి పావని తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి తుపాను ముప్పు



(మొదటి పేజీ తరువాయి)

వాయుగుండం గంటకు సుమారు 10 కిలోమీటర్ల వేగంతో ఉత్తర దిశగా పయనిస్తోంది. ఇది చెన్నైకి 840 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 1,010 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 1,130 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. దక్షిణ, మధ్య పశ్చిమ బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**19 నుంచి భారీ వర్షాలు :** తుపాను ప్రభావంతో ఈ నెల 19వ తేదీ నుంచి రాష్ట్రంలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కోస్తాంధ్ర తీర ప్రాంతంలో తుపాను తీరం దాటే అవకాశం ఉందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అయితే, దాని గమనం, తీవ్రతపై స్పష్టత రావాల్సి ఉంది. వాయుగుండం కదలికలను వెదర్ డాప్లర్ రాడార్ల ద్వారా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## డిసెంబరులో పార్లమెంటు సమావేశాలు



(మొదటి పేజీ తరువాయి)

జాతీయ స్థాయిలో ఆందోళనలను ఉద్ధృతం చేస్తున్నాయి. శీతాకాల సమావేశాల్లోనూ ఈ అంశాన్ని లేవనెత్తి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతున్నాయి. దీంతో సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశముంది.

**మెజార్టీ సాధనపై సర్కారు కసరత్తు :** లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవడం కేంద్ర ప్రభుత్వానికి సవాలుగా మారనుంది. సభలో మూడు స్థానాలు ఖాళీగా ఉండటంతో ప్రస్తుతం సభ్యుల సంఖ్య 540గా ఉంది. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి మూడింట రెండొంతుల మంది సభ్యుల మద్దతు అవసరం. అంటే కనీసం 361 మంది అనుకూలంగా ఓటు వేయాలి. ఈ సంఖ్యను చేరుకోవాలంటే విపక్ష పార్టీల మద్దతు కూడా కీలకం కానుంది. ఈ నేపథ్యంలో డీఎంకే, ఎన్సీపీతో పాటు స్వతంత్ర సభ్యుల మద్దతు కూడగట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం.

## ఘనంగా బుక్ ఫెస్టివల్ కార్యక్రమం



**పోరుమామిళ్ల (జర్నలిస్ట్ ఫైల్):** పోరుమామిళ్ల గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని లైబ్రేరియన్ ఆఫ్రిది ఆధ్వర్యంలో ఆదివారం బుక్ ఫెస్టివల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథు లుగా పాల్గొన్న కాశినాయన మండల విద్యాశాఖాధికారి మహమ్మద్ షఫీ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదా పీర్, విశ్రాంత డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ. డా.మార్కా రెడ్డి మాట్లాడుతూ... పుస్తక పఠనం ద్వారా విద్యార్థులలో జ్ఞానం, ఆలోచనశక్తి,సృజనాత్మక శక్తి పెరుగుతాయన్నారు.నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లకు పరిమితం కాకుండా పుస్తక పఠనం అలవర్చుకొని విజ్ఞానవంతులు కావాలన్నారు. విద్యార్థులలో పఠనాసక్తిని పెంపొందించడమే ఈ బుక్ ఫెస్టివల్ ముఖ్య ఉద్దేశమన్నారు. లైబ్రేరియన్ ఆఫ్రిది వివిధ రకాల పుస్తకాలను గ్రంథాలయంలో ప్రదర్శించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో బుక్ ఫెస్టివల్ కార్యక్రమం సందడిగా విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగి పర్వీన్, పూజిత, రాము, బాష, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి

## ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

### తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు













**తెనాలి, నవంబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్)** : బాలలే దేశ భవిష్యత్తుకు పునాదులని, నేటి చిన్నారులే రేపటి భారతదేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే భావి పౌరులని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రతి బాలుడికి నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, సమాన అవకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని పిలుపునిచ్చారు.

తెనాలి పట్టణంలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు డాక్టర్ కె. రమేష్ నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చిన్నారులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలల దినోత్సవం కేవలం వేడుకలకు మాత్రమే పరిమితం కాకుండా, పిల్లల హక్కులు, విద్య, ఆరోగ్యం, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరికీ గుర్తుచేసే గొప్ప సందర్భమని పేర్కొన్నారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని, అప్పుడే సమాజంలో సమాన అవకాశాలు ఏర్పడతాయని అన్నారు.

పిల్లల్లో చిన్నతనం నుంచే క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, సేవాభావం వంటి మంచి లక్షణాలను పెంపొందించాలని సూచించారు. చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పిల్లలు చురుగ్గా పాల్గొనేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, వారి అభిరుచులకు అనుగుణంగా ప్రోత్సహించినప్పుడే వారు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు.

నేటి బాలలపై పెట్టే ప్రతి మంచి పెట్టుబడి రేపటి సమాజ అభివృద్ధికి పునాది అవుతుందని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పిల్లలకు అందించే విద్య, సంస్కారం, ప్రోత్సాహమే దేశానికి నిజమైన సంపద అని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. అపజయాలకు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, ప్రతి అనుభవాన్ని విజయానికి మెట్టుగా మలుచుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు పిల్లలపై చదువుల విషయంలో అనవసరమైన ఒత్తిడి పెంచకుండా, వారిలోని ఆసక్తులు, అభిరుచులు, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యాబోధనతోపాటు విద్యార్థుల్లో నైతిక విలువలు, సామాజిక బాధ్యత, సృజనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారుల కోసం పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభా కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన వివిధ వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ బహుమతులు అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ పావని ప్రియాంక, ఎన్. ఆదినారాయణ, సొసైటీ ప్రతినిధులు బి. సుధాకర్, మార్కండేయులు, నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# అప్రమత్తతే మధుమేహానికి అసలైన ఆయుధం

- **గుంటూరు సీ. జీ. హెచ్. ఎస్ డాక్టర్లు కొండా నాగార్జున, దాసరి రమేష్**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** : మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గిపోవడం కారణంగా మధుమేహం వేగంగా విస్తరిస్తోందని, దీనిని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గుంటూరు సీ. జీ. హెచ్. ఎస్ (సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం) చీఫ్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ కొండా నాగార్జున, డాక్టర్ దాసరి రమేష్ లు పిలుపునిచ్చారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గుంటూరు నగరం పాలెంలోని సీ. జీ. హెచ్. ఎస్ వెల్నెస్ సెంటర్ లో మధుమేహ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు కొండా నాగార్జున, దాసరి రమేష్ లు మాట్లాడుతూ, మధుమేహం ఒక్క వయసు వారికో, ఒక్క వర్గానికో పరిమితమైన సమస్య కాదన్నారు. రోజువారీ ఆహారంలో అధిక చక్కెర, కొవ్వు పదార్థాలు తగ్గించుకోవాలని, రుచికి ప్రాధాన్యత ఇస్తూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. హోటళ్లు, రెస్టారెంట్లు తమ మెనూల్లో రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి చిరుధాన్యాల వంటకాలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఫాస్ట్ ఫుడ్ హానికరమనే హెచ్చరికలను ఆహార పదార్థాల ప్యాకేజీలపై ముద్రించే విధానం ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రతి రోజూ నడక, వ్యాయామం, బరువు నియంత్రణ, చురుకైన జీవనశైలి అవసరమన్నారు. మధుమేహం ప్రారంభ దశలో లక్షణాలు కనిపించకపోవచ్చని, కుటుంబ చరిత్ర, అధిక బరువు ఉన్నవారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని వారు సూచించారు. అనంతరం సీ జీ హెచ్ ఎస్ లబ్ధిదారులకు రక్త పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణి చేసారు. లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబర్లు గుమ్మడి సీతారామయ్య చౌదరి, కట్టా వెంకటేశ్వర్లు చిరుధాన్యాలను ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ల తో పాటు, ఫార్మాసిస్టు కౌసల్య, ఆయోషా, సునీల్ సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ హేమ సుందరి వైద్య సిబ్బంది పేరేశ్వరరావు, మురళీ, రామారావు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఉత్సవాలు సమాజంలో నూతనోత్తేజాన్ని నింపుతాయి

- **కార్తీక దీపోత్సవంలో మంత్రి కందుల దుర్గేష్**



**రాజమహేంద్రవరం, నవంబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్)** : కార్తీక మాసంలో నిర్వహించే ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఉత్సవాలు సమాజంలో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు నూతనోత్తేజాన్ని నింపుతాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని మన్యం గార్డెన్స్‌లో ఆదివారం ఈటీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక దీపోత్సవంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివకేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసం ప్రకృతి ఆరాధనకు, భక్తి పారవశ్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ వేలాది మంది మహిళలు సామూహిక దీపారాధనలో పాల్గొనడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంతో రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసిందన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించిన ఈనాడు, ఈటీవీ యాజమాన్యాలను అభినందించారు. కార్తీక మాసంలో దీపారాధన ద్వారా ఆత్మజ్యోతిని వెలిగించుకోవడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే శాస్త్రీయ కళలను ఆరాధించడం మన సంస్కృతికి మరింత వన్నె తెస్తుందని మంత్రి అన్నారు.

# కార్యకర్తే అధినేత.. సామాన్య కార్యకర్తకు మేయర్ కిరీటం

- **సామాన్య కార్యకర్తకు మేయర్ పీఠం.. కార్యకర్తలే పార్టీకి అధినేతలని చాటిన మంత్రి నారా లోకేష్**
- **మంగళగిరి రాజకీయ చరిత్రలో సరికొత్త అధ్యాయం.. ఆర్థిక బలం, రాజకీయ పలుకుబడికి కాకుండా పార్టీ పట్ల విధేయత, అంకితభావానికి పట్టం**

**గుంటూరు, నవంబరు 15(జర్నలిస్ట్ ఫైల్ )**: రాజకీయాల్లో పదవులు సంపన్నులకే పరిమితం కావని, పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే సామాన్య కార్యకర్తలకు సైతం అత్యున్నత అవకాశాలు కల్పించవచ్చని మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ మరోసారి నిరూపించారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ మేయర్ పదవికి ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన అట్టడుగు స్థాయి సామాన్య కార్యకర్తను ఎంపిక చేయడం ద్వారా రాజకీయాల్లో సరికొత్త సందేశాన్ని ఇచ్చారు.

సాధారణంగా రాజకీయాల్లో ఆర్థిక స్థోమత, రాజకీయ పలుకుబడి, సామాజిక హోదా ఉన్నవారికే కీలక పదవులు దక్కుతాయనే అభిప్రాయం ఉంది. అయితే అలాంటి సంప్రదాయాలకు భిన్నంగా పార్టీనే నమ్ముకుని, కష్టకాలంలోనూ జెండా మోస్తూ, పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన సామాన్య కార్యకర్తకు మేయర్ వంటి అత్యున్నత పదవిని అందించాలనే నిర్ణయం తీసుకోవడం ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది.



తెలుగుదేశం పార్టీకోసం ఎన్నో ఏళ్లుగా విధేయతతో పనిచేస్తూ, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, నాయకత్వంపై నమ్మకంతో ముందుకు సాగిన కార్యకర్త సేవలను గుర్తించి ఈ అవకాశం కల్పించడం ద్వారా నారా లోకేష్ తన రాజకీయ దార్శనికతను చాటుకున్నారు. పదవులు ఆశించి కాకుండా పార్టీ కోసం పనిచేసే వారికి తగిన సమయంలో సముచిత గుర్తింపు, గౌరవం లభిస్తాయనే భరోసాను ఈ నిర్ణయం కల్పిస్తోంది.

ముఖ్యంగా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన సామాన్య కార్యకర్తకు మేయర్ పదవిని కట్టబెట్టడం సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యత ఇచ్చిన నిర్ణయంగా రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. సమాజంలోని అట్టడుగు వర్గాలకు నాయకత్వ అవకాశాలు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికీ ఎదిగే అవకాశం ఉందనే సందేశాన్ని ఈ పరిణామం చాటుతోంది.

మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు కల్పించడంలోనూ నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. సామాన్య కార్యకర్తకు అత్యున్నత బాధ్యత అప్పగించడం ద్వారా నాయకత్వం అంటే కేవలం పదవులు అనుభవించడం కాదని, కార్యకర్తల శ్రమను గుర్తించి వారిని ఉన్నత స్థానాలకు తీసుకెళ్లడమనే భావనను బలపరిచారు.

ఈ నిర్ణయం మంగళగిరి తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు, భవిష్యత్తులో పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిగా నిలవనుంది. రాజకీయాల్లో వారసత్వం, ఆర్థిక బలం, పలుకుబడి కంటే క్రమశిక్షణ, విధేయత, అంకితభావం కూడా ఉన్నత పదవులకు మార్గం చూపుతాయని ఈ పరిణామం మరోసారి చాటిచెప్పింది.

మొత్తంగా సామాన్య కార్యకర్తను మేయర్ పీఠానికి ఎంపిక చేయడం ద్వారా కార్యకర్తలే పార్టీకి బలమని, వారి కష్టానికి తగిన గుర్తింపు ఇవ్వడమే నిజమైన నాయకత్వమని మంత్రి నారా లోకేష్ తన నిర్ణయంతో చాటిచెప్పారు. ఈ పరిణామం మంగళగిరి రాజకీయ చరిత్రలో ప్రత్యేక ఘట్టంగా నిలవనుంది.

# 20లక్షల ఉద్యోగాలకు కార్యాచరణ



**విజయనగరం కోట:** ఆంధ్రప్రదేశ్ పేరును ప్రపంచ బ్రాండ్లో నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని రాష్ట్ర ఎన్ఆర్ఐ ఎస్ఎంఎస్ సి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కొనియాడారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా యువత ఉద్యోగాల కోసం ఇంత చొరవ తీసుకోలేదన్నారు. ముఖ్యమంత్రి విశాఖపట్నానికి ఒక బ్రాండ్ తీసుకొని వచ్చారు. విశాఖపట్నానికి ఎక్కువ ఐటీ కంపెనీలు తీసుకొని వచ్చామన్నారు– యువగళంలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం 20 లక్షల ఉద్యోగాలకు కార్యాచరణ చేస్తున్నామన్నారు. రూ. 3,800 కోట్లతో ప్రతి ప్రాంతానికి బల్క్ ఇండస్ట్రీలకు కేటాయించారన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంయి పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆ ప్రాంతంలో ఉన్న యువత అదే ప్రాంతంలో ఉద్యోగాలు చేసుకునే విధంగా ఉపాధి కల్పించటమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. గడిచిన 3 నెలల నుంచి 5 దేశాల్లో మన రాష్ట్రానికి పెట్టుబడుల కోసం ప్రచారం చేస్తూ ముందుకు వెళ్లాము– ఇప్పటికే రూ. 33 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. స్పేస్ రిలేటెడ్ కంపెనీలకు ప్రత్యేక స్థాయిలో అవకాశం ఇచ్చామన్నారు. ఐదు సంవత్సరాల్లో ఎయిర్‌పోర్ట్‌కు ఒక ప్రహరీ కూడా తీసుకొని రాలేకపోయారు– గతంలో రాష్ట్రానికి వచ్చిన ఒక్క కంపెనీని కూడా నిలుపుకోలేకపోయారు. శ్రీకాకుళంలో గెయిల్, కోరమాండల్ లాంటి కంపెనీలు వచ్చాయి,బొత్స సత్యనారాయణ ఏమంటున్నారో వాళ్లకే తెలియాలి, ఉత్తరాంధ్రకు ఏం చేశారు, విజయనగరం జిల్లాకు ఏం చేశారు. ఇన్నేళ్లుగా నాయకత్వం వహించారు, అసలు ఈ ప్రాంతానికి ఏం చేశారో ప్రజలందరికీ తెలుసు అన్నారు.ఓన్లీ విజయనగరం జిల్లాకే రూ. 2,700 కోట్ల పైచిలుకు పెట్టుబడులు వచ్చాయి. 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ 2026 ద్వారా 714 ప్రాజెక్టులు, రూ. 22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు– సుమారు 19,00,000 ఉద్యోగ కల్పనకు సిద్ధమవుతున్నాం, ప్రపంచమంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోందన్నారు.

# టీమిండియాదే సిరీస్



**మౌంట్ మాంగనుయ్** : ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ టీమ్ ఇండియా సొంతమైంది. స్వల్ప స్కోర్ల థ్రిల్లర్‌లో భారత పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, మహ్మద్ సిరాజ్ టీమ్ ఇండియాకు మెరుపు విజయాన్ని కట్టబెట్టారు. బ్యాట్‌తో తొలుత చెరో 14 పరుగులు చేసిన అర్ష్‌దీప్, సిరాజ్‌లు.. అనంతరం బంతితో సమిష్టిగా 5 వికెట్లు పడగొట్టారు. ఫలితంగా, ఆఖరు వన్డేలో న్యూజిలాండ్‌పై భారత్ 22 పరుగుల తేడాతో మెరుపు విజయం సాధించింది. 210 పరుగుల ఛేదనలో న్యూజిలాండ్ 48.1 ఓవర్లలో 187 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ (31, 42 బంతుల్లో 5 ఫోర్లు), నిక్ కెల్లీ (24, 45 బంతుల్లో 2 ఫోర్లు), మిచెల్ శాంట్నర్ (24, 31 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఛేదనలో పోరాడినా.. భారత బౌలర్లు నిలకడగా వికెట్లు పడగొట్టారు. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 42.1 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. ఇషాన్ కిషన్ (46, 58 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (46, 55 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) విలువైన ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచిన అర్ష్‌దీప్ సింగ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలువగా.. యువ పేసర్ గుర్నూర్ బరార్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 3–1తో గెల్చుకుంది. భారత్, న్యూజిలాండ్ వైట్‌బాల్ ఫార్మాట్ పోరు ముగియగా.. గురువారం నుంచి టెస్టు సిరీస్ షురూ కానుంది.

**ఆ ఇద్దరు మెరవగా** : కీలక టాస్ ఓడినా, భారత తొలుత బ్యాట్ పట్టింది. ఓపెనర్ రోహిత్ శర్మ (7), విరాట్ కోహ్లి (5) మరోసారి నిరాశపరిచారు. రుతురాజ్ గైక్వాడ్ (18, 27 బంతుల్లో 3 ఫోర్లు) మంచి ఆరంభాన్ని సద్వినియోగం చేసుకోలేదు. దీంతో భారత్ పవర్‌ప్లేలో 3 వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (22, 26 బంతుల్లో 3 ఫోర్లు) ఎదురుదాడి చేసే ప్రయత్నం చేసినా.. ఎంతోసేపు వికెట్ కాపాడుకోలేదు. అక్షర్ పటేల్ (46) కలిసి నాల్గో వికెట్‌కు 52 పరుగులు జోడించిన అయ్యర్‌ను టిక్‌నర్ సాగనంపాడు. అప్పటికి భారత్ స్కోరు 86/4. ఈ సమయంలో అక్షర్ పటేల్‌తో జతకట్టిన ఇషాన్ కిషన్ (46) విలువైన భాగస్వామ్యాలు నిర్మించాడు. అర్ధ సెంచరీ ముంగిట అక్షర్ అవుటైనా.. నమన్‌ధీర్ (22)తో కలిసి ఆరో వికెట్‌కు 39 పరుగులు జోడించాడు. అకిబ్ నబి, యశ్ ఠాకూర్ నిష్క్రమించినా.. మహ్మద్ సిరాజ్ (14 నాటౌట్)తో కలిసి 17 పరుగులు జోడించారు. అర్ధ సెంచరీ ముంగిట ఇషాన్ సైతం వెనుదిరిగాడు. అప్పటికి భారత్ స్కోరు 183/9. ఆఖరు వికెట్‌కు సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్ (14)లు 10 బంతుల్లోనే 26 పరుగులు జోడించారు. అక్షర్ రెండు సిక్సర్లు కొట్టగా.. సిరాజ్ ఓ సిక్సర్, ఫోర్‌తో మెరిశాడు. దీంతో భారత్ 209 పరుగులు చేసింది. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫ్ఫీ (3/60), మాథ్యూ షిఫర్ (2/28), మిచెల్ శాంట్నర్ (3/47) రాణించారు.

**బౌలర్లు కలిసికట్టుగా..** : 209 పరుగులను కాపాడుకునేందుకు భారత బౌలర్లు సమిష్టిగా విజృంభించారు. కివీస్‌ను నిలకడగా ఒత్తిడి పెంచిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 35 ఓవర్ల వరకు స్పిన్నర్‌కు బంతి ఇవ్వలేదు. విల్ యంగ్ (22), నిక్ కెల్లీ (24), డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ (31) క్రీజులో నిలదొక్కుకునే ప్రయత్నం చేసినా భారత పేసర్లు ఆ అవకాశం ఇవ్వలేదు. సిరీస్‌లో తొలిసారి ఆడిన మహ్మద్ సిరాజ్ వికెట్ల వేట షురూ చేయగా.. అర్ష్‌దీప్ సింగ్, అకిబ్ నబి , యశ్ ఠాకూర్ కొనసాగించారు. అక్షర్ పటేల్, నమన్ ధీర్‌లు సైతం సమిష్టిగా 3 వికెట్లు పడగొట్టి కివీస్‌ను కట్టడి చేశారు. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. 48.1 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌటైన న్యూజిలాండ్ 22 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఫ్లడ్ లైట్ల వెలుతురులో సీమ్, స్వింగ్ ఎటాక్‌ను కొనసాగించిన శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా తనేంటో చూపించాడు.

**సంక్షిప్త స్కోరు వివరాలు** : భారత్ ఇన్నింగ్స్ : 209/10 (ఇషాన్ కిషన్ 46, అక్షర్ పటేల్ 46, నమన్ ధీర్ 22, శ్రేయస్ అయ్యర్ 22, జాకబ్ డఫ్ఫీ 3/60, మిచెల్ శాంట్నర్ 3/47, మాథ్యూ ఫిషర్ 2/28)

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ : 187/10 (డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ 31, నిక్ కెల్లీ 24, మిచెల్ శాంట్నర్ 24, విల్ యంగ్ 22, అర్ష్‌దీప్ సింగ్ 3/30, మహ్మద్ సిరాజ్ 2/50, అక్షర్ పటేల్ 2/28)




- వారసత్వం కాదు.. పనితీరే నాయకత్వానికి గీటురాయి!
- లోకేష్ ఎదుగుదలకు ప్రజాక్షేత్రమే ప్రామాణికం..
- చంద్రబాబు వ్యాఖ్యలతో రాజకీయ విమర్శలకు సమాధానం

### విమర్శలను దాటి..

# విశ్వసనీయ నాయకత్వం దిశగా లోకేష్



రాజకీయాల్లో వారసత్వం ఎప్పుడూ చర్చనీయాంశమే. ముఖ్యంగా రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన నాయకుల ఎదుగుదలపై ప్రత్యర్థులు విమర్శలు చేయడం సహజం. అయితే ప్రజాస్వామ్యంలో ఒక నాయకుడి భవిష్యత్తును నిర్ణయించేది కుటుంబ నేపథ్యం మాత్రమే కాదు.. ప్రజలతో ఆయనకున్న అనుబంధం, పార్టీ కోసం చేసిన కృషి, ఎదురుదెబ్బలను అధిగమించే పట్టుదల, పరిపాలనా సామర్థ్యమే. ఈ అంశాల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది.

విశాఖపట్నంలో జరిగిన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా జాతీయ జర్నలిస్టుతో జరిగిన ముఖాముఖిలో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తెలుగుదేశం పార్టీలో వారసత్వ రాజకీయాలకు స్థానం లేదని, కష్టపడి పనిచేసే కార్యకర్తలకు, సామర్థ్యం, ప్రజాదరణ కలిగిన నాయకులకే పార్టీలో గుర్తింపు, నాయకత్వ అవకాశాలు లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. లోకేష్‌కు పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించే విషయంలోనూ తొందరపడటం లేదని, రాష్ట్రంతో పాటు జాతీయ రాజకీయాలపై మరింత అవగాహన, అనుభవం పెంచుకునేలా ప్రోత్సహిస్తున్నామనే సంకేతాలు ఇచ్చారు.

చంద్రబాబు వ్యాఖ్యల్లో మరో కీలకమైన సందేశం ఉంది. రాజకీయాల్లో కుటుంబ నేపథ్యం ప్రవేశానికి అనుకూలత కల్పించవచ్చేమో కానీ, నాయకత్వాన్ని మాత్రం పనితీరుతోనే సంపాదించుకోవాలి. ఇది కేవలం లోకేష్ విషయంలోనే కాకుండా తెలుగుదేశం పార్టీలోని ప్రతి నాయకుడికి, కార్యకర్తకు వర్తించే సూత్రం. పార్టీని నమ్ముకుని పనిచేసే వారికి అవకాశాలు కల్పించాలన్న అధినేత ఆలోచన సంస్థాగత ప్రజాస్వామ్యానికి బలాన్నిస్తుంది.

నిజానికి లోకేష్ రాజకీయ ప్రస్థానం విమర్శలకు అతీతమైనది కాదు. 2019 ఎన్నికల్లో మంగళగిరి నుంచి ఓటమి ఎదురైనా ఆయన రాజకీయాలకు దూరం కాలేదు. అదే నియోజకవర్గంలో ప్రజల మధ్య ఉంటూ, సమస్యలను తెలుసుకుంటూ, పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేశారు. 2024 ఎన్నికల్లో అదే మంగళగిరి నుంచి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఆయన రాజకీయ ప్రయాణంలో కీలక మలుపు. ఒకసారి ఓడిపోయిన చోటే ప్రజల విశ్వాసాన్ని తిరిగి సంపాదించుకోవడం ఆయన పట్టుదలకు నిదర్శనం.

2023లో చేపట్టిన యువగళం పాదయాత్ర లోకేష్ రాజకీయ జీవితంలో మరో ముఖ్యమైన అధ్యాయం. రాష్ట్రవ్యాప్తంగా వేల కిలోమీటర్లు పర్యటిస్తూ యువత, రైతులు, మహిళలు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలతో మమేకమయ్యారు. వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పాదయాత్ర ఆయనకు రాజకీయ అనుభవాన్ని మాత్రమే కాకుండా క్షేత్రస్థాయి ప్రజాజీవితంపై లోతైన అవగాహనను అందించింది. విమర్శలకు సమాధానం చెప్పేందుకు ప్రసంగాలను కాకుండా ప్రజాక్షేత్రాన్ని వేదికగా ఎంచుకోవడం ఆయనలో వచ్చిన రాజకీయ పరిణతికి నిదర్శనం.

పార్టీ వ్యవహారాల్లోనూ లోకేష్ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నించారు. ఐటీడీపీ ద్వారా పార్టీ డిజిటల్ వ్యవస్థను బలోపేతం చేయడం, సభ్యత్వ నమోదు, కార్యకర్తల సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ సమాచార వ్యవస్థ ఆధునికీకరణ వంటి అంశాల్లో ఆయన నిర్వహించిన బాధ్యతలు పార్టీ సంస్థాగత నిర్మాణంలో కీలకంగా నిలిచాయి. కార్యకర్తలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం, యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం ఆయన రాజకీయ దృక్పథాన్ని ప్రతిబింబిస్తోంది.

మంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలు, ఉపాధి కల్పన వంటి రంగాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయ సంస్థలను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం లక్ష్యంగా పనిచేస్తున్నారు. విశాఖపట్నాన్ని ఐటీ, ఏఐ, సాంకేతిక రంగాలకు కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రయత్నాలు కూడా భవిష్యత్ ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నాయి.

సీఐఐ భాగస్వామ్య సదస్సులో పెట్టుబడిదారులతో జరిగిన చర్చలు, రాష్ట్రానికి వచ్చిన భారీ పెట్టుబడి ప్రతిపాదనలు, వాటిని కార్యరూపంలోకి తీసుకురావాలనే ప్రభుత్వ ప్రయత్నాలు ఆర్థికాభివృద్ధిపై లోకేష్ చూపుతున్న దృష్టిని వెల్లడిస్తున్నాయి. కేవలం పెట్టుబడుల ప్రకటనలకే పరిమితం కాకుండా పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించాలన్నది ఆయన ముందున్న ప్రధాన లక్ష్యం.

చంద్రబాబు రాజకీయ అనుభవం, పరిపాలనా దక్షత ఒకవైపు ఉంటే, లోకేష్ యువతరానికి ప్రాతినిధ్యం వహిస్తూ ఆధునిక సాంకేతికత, నూతన ఆలోచనలు, పెట్టుబడులు, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం మరోవైపు కనిపిస్తోంది. ఈ రెండు తరాల అనుభవాలు సమన్వయంతో ముందుకు సాగితే తెలుగుదేశం పార్టీకి భవిష్యత్తులో మరింత బలం చేకూరే అవకాశం ఉంది.

అయితే లోకేష్ ముందున్న బాధ్యతలు కూడా తక్కువేమీ కాదు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడం, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, కార్యకర్తలకు తగిన గుర్తింపు కల్పించడం, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో వేగం పెంచడం, ప్రజల విశ్వాసాన్ని నిరంతరం నిలబెట్టుకోవడం వంటి అంశాల్లో తన సామర్థ్యాన్ని మరింతగా నిరూపించుకోవాలి. నాయకత్వం అనేది ఒకరోజులో లభించే గుర్తింపు కాదు. నిరంతర కృషి, ప్రజాసేవ, సమర్థవంతమైన నిర్ణయాలు, ప్రజల ఆమోదం ద్వారా సంపాదించుకోవాల్సిన గౌరవం. చంద్రబాబు తాజా వ్యాఖ్యలను ఈ కోణంలో పరిశీలిస్తే అవి లోకేష్‌కు రాజకీయంగా ముందస్తు హోదా ప్రకటించడం కంటే, ఆయన మరింత పరిణతి సాధించి నాయకత్వానికి అన్ని విధాలా సిద్ధం కావాలనే దిశానిర్దేశంగా కనిపిస్తున్నాయి. అదే సమయంలో పార్టీలో పనిచేసే ప్రతి ఒక్కరికీ ప్రతిభ, కష్టపడే తత్వం, ప్రజాదరణే ఎదుగుదలకు ప్రాతిపదిక అని స్పష్టం చేస్తున్నాయి.


ఒక నాయకుడి కుటుంబ నేపథ్యం రాజకీయాల్లోకి ప్రవేశించడానికి అవకాశం కల్పించవచ్చు. కానీ ప్రజల మధ్య నిలదొక్కుకోవడం, ఎన్నికల్లో గెలవడం, కార్యకర్తల విశ్వాసాన్ని సంపాదించడం, పరిపాలనలో తనదైన ముద్ర వేయడం వ్యక్తిగత సామర్థ్యంతోనే సాధ్యం. నారా లోకేష్ రాజకీయ ప్రస్థానాన్ని కూడా ఇదే ప్రాతిపదికన అంచనా వేయాలి.

వారసత్వం రాజకీయ ప్రవేశానికి ఒక మార్గం కావచ్చు.. కానీ నాయకత్వానికి ప్రజల ఆమోదమే అసలైన అర్హత. ఆ అర్హతను నిరంతర ప్రజాసేవతో సంపాదించుకోవాలన్న చంద్రబాబు సందేశం, లోకేష్ రాజకీయ భవిష్యత్తుకు ఒక స్పష్టమైన

---

# ప్రపంచ రాజకీయాల్లో పెనుమార్పులు.. అధికార పీఠాలకు హెచ్చరిక!

**బ్రెజిల్ నుంచి అమెరికా వరకు అధికార రాజకీయాలకు ఎదురుదెబ్బ..**
**సెర్బియాలో విద్యార్థి ఉద్యమం సృష్టించిన సంచలనం..**
**ఇజ్రాయిల్‌లో మారిన రాజకీయ సమీకరణాలు..**
**ప్రజల ఆకాంక్షలను విస్మరిస్తే అధికారాలకు ముప్పు తప్పదన్న సంకేతాలు!**




ప్రపంచ రాజకీయాలు కీలకమైన పరివర్తన దశలో ఉన్నాయా? జాతీయవాదం, మతపరమైన భావోద్వేగాలు, బలమైన నాయకత్వం, ప్రజాకర్షక నినాదాలతో అధికారంలోకి వచ్చిన రాజకీయ శక్తులకు ప్రజల నుంచి సవాళ్లు ఎదురవుతున్నాయా? ప్రభుత్వాల పనితీరు, ఆర్థిక అసమానతలు, ప్రజాస్వామ్య హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాలు మరోసారి ఎన్నికల అజెండాలోకి వస్తున్నాయా? ఇటీవల బ్రెజిల్, సెర్బియా, ఇజ్రాయిల్, అమెరికాలో చోటుచేసుకున్న ఎన్నికల పరిణామాలు ఈ ప్రశ్నలకు కొత్త ప్రాధాన్యతను కల్పిస్తున్నాయి. వేర్వేరు ఖండాల్లో, భిన్నమైన రాజకీయ పరిస్థితుల్లో జరిగిన ఎన్నికలు ఒక విషయాన్ని మాత్రం గుర్తుచేస్తున్నాయి. ప్రజల మద్దతు శాశ్వతం కాదు. అధికారంలో ఉన్నవారు ప్రజల ఆకాంక్షలను విస్మరిస్తే ఎన్నికల ద్వారా తమ అసంతృప్తిని వ్యక్తం చేయడానికి ఓటర్లు వెనుకాడరు.

ఈ పరిణామాలను ఒకే రాజకీయ ధోరణికి నిదర్శనంగా చూడలేం. ప్రతి దేశానికి ప్రత్యేకమైన చరిత్ర, సామాజిక పరిస్థితులు, ఆర్థిక సమస్యలు ఉన్నాయి. అయినప్పటికీ అధికార కేంద్రీకరణ, ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రత, ఆర్థిక భద్రత, ప్రజల జీవన ప్రమాణాలు వంటి అంశాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో ఈ పరిణామాలను విశ్లేషించాల్సిన అవసరం ఉంది.

**బ్రెజిల్‌లో లూలా విజయం.. సామాజిక న్యాయానికి ప్రాధాన్యం :** బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల్లో లూలా డా సిల్వా మరోసారి విజయం సాధించడం అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. మితవాద రాజకీయ శక్తులకు చెందిన ఫ్లావియో బోల్సనారోతో జరిగిన పోటీలో లూలా విజయం సాధించారు. పేదరిక నిర్మూలన, ఆర్థిక అసమానతల తగ్గింపు, కార్మికుల హక్కులు, సామాజిక భద్రత వంటి అంశాలు ఆయన రాజకీయ ప్రస్థానంలో కీలకంగా ఉన్నాయి. ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరిచే విధానాలకు ఎన్నికల్లో ప్రాధాన్యం ఉంటుందని ఈ ఫలితం మరోసారి చాటింది. అయితే కాంగ్రెస్‌లో ప్రతికూల రాజకీయ సమీకరణాలు, విభజిత ప్రజాభిప్రాయం ఆయన పాలనకు సవాళ్లుగా నిలవనున్నాయి. ప్రజాకర్షక నినాదాల కంటే ప్రజల ఆర్థిక సమస్యలకు పరిష్కారాలు చూపడమే ప్రభుత్వాల విశ్వసనీయతకు కొలమానం.

**సెర్బియాలో విద్యార్థుల ఉద్యమం.. రాజకీయ శక్తిగా యువత :** ప్రపంచ రాజకీయాల్లో అత్యంత ఆసక్తికరమైన పరిణామం సెర్బియాలో కనిపించింది. దాదాపు రెండేళ్లుగా అవినీతి, ప్రభుత్వ వైఫల్యాలు, అధికార కేంద్రీకరణకు వ్యతిరేకంగా కొనసాగిన విద్యార్థుల ఉద్యమం ఎన్నికల రాజకీయాల్లోకి ప్రవేశించి విజయం సాధించింది. అలెగ్జాండర్ వూసిక్ నేతృత్వంలోని సుదీర్ఘకాల రాజకీయ ఆధిపత్యానికి విద్యార్థుల మద్దతుతో ఏర్పడిన ప్రత్యామ్నాయ శక్తి సవాలు విసిరింది. నిరసనలతో ప్రారంభమైన ఉద్యమం ఎన్నికల విజయంగా మారడం యువత రాజకీయ భాగస్వామ్యానికి కొత్త ప్రాధాన్యం కల్పించింది.

ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు, యువతకు ఒక సందేశాన్ని ఇస్తోంది. రాజకీయాలంటే కేవలం సంప్రదాయ పార్టీలకే పరిమితమైన వ్యవహారం కాదు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే చైతన్యం, సంఘటిత ఉద్యమం, ప్రత్యామ్నాయ ఆలోచనలు ఉంటే యువత కూడా రాజకీయ మార్పులో కీలక పాత్ర పోషించగలరు. అయితే ఉద్యమం ద్వారా అధికారంలోకి రావడం ఒక దశ మాత్రమే. సమర్థవంతమైన పాలన అందించడం, ప్రజల అంచనాలను నెరవేర్చడం అసలైన పరీక్ష.

**ఇజ్రాయిల్‌లో నెతన్యాహుకు రాజకీయ సవాళ్లు :** ఇజ్రాయిల్‌లో బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని కూటమి మెజారిటీ కోల్పోవడం మరో ముఖ్యమైన పరిణామం. 2023 అక్టోబర్ 7న హమాస్ దాడి అనంతరం దేశ భద్రత, గాజా యుద్ధం, ప్రభుత్వ బాధ్యత, సైనిక విధానాలపై తీవ్ర చర్చ జరిగింది. భద్రత పేరుతో తీసుకునే నిర్ణయాలపైనా ప్రజలకు ప్రశ్నించే హక్కు ఉంటుందని అక్కడి రాజకీయ పరిణామాలు గుర్తుచేస్తున్నాయి. జాతీయ భద్రత ఎంత ముఖ్యమో, ప్రభుత్వ జవాబుదారీతనం కూడా అంతే ముఖ్యమన్న విషయం ఈ ఎన్నికల నేపథ్యంలో మరోసారి చర్చకు వచ్చింది. అయితే కొత్త ప్రభుత్వ ఏర్పాటులో రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం సాధించడం ఇప్పటికీ సవాలుగానే ఉంది.

**అమెరికాలో ట్రంప్ ప్రభుత్వానికి ప్రజల సందేశం :** అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు కాంగ్రెస్ ఉభయ సభల్లో ఆధిపత్యం సాధించడం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి రాజకీయంగా గట్టి సవాలుగా మారింది. ఆర్థిక పరిస్థితులు, జీవన వ్యయం, ప్రభుత్వ విధానాలు, ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రత వంటి అంశాలు ఎన్నికల చర్చలో కీలకంగా నిలిచాయి. కాంగ్రెస్‌లో ప్రతిపక్షానికి ఆధిక్యం లభించడంతో అధ్యక్షుడి నిర్ణయాలపై పర్యవేక్షణ, విచారణలు, చట్టసభల నియంత్రణకు మరింత అవకాశం ఏర్పడింది. ప్రజాస్వామ్యంలో అధికారానికి రాజ్యాంగపరమైన పరిమితులు ఉండాలన్న సూత్రానికి ఈ పరిణామం ప్రాధాన్యం చేకూరుస్తోంది.

**జాతీయవాదం ఒక్కటే రాజకీయ విజయానికి సరిపోదు! :** గత దశాబ్దంలో ప్రపంచంలోని అనేక దేశాల్లో జాతీయవాదం, మతపరమైన గుర్తింపులు, వలసదారుల వ్యతిరేకత, బలమైన నాయకత్వం వంటి అంశాలు రాజకీయ ప్రచారంలో ప్రధానంగా నిలిచాయి. అయితే ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేసే నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక అసమానతలు, వైద్య, విద్యా సమస్యలను విస్మరించడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాదు. ఆర్థిక వృద్ధి గణాంకాలు పెరిగినా వాటి ప్రయోజనాలు సామాన్య ప్రజలకు అందకపోతే ప్రభుత్వాలపై అసంతృప్తి పెరుగుతుంది.

ప్రజాస్వామ్యం అంటే ఎన్నికల్లో గెలవడం మాత్రమే కాదు. న్యాయవ్యవస్థ స్వతంత్రత, పత్రికా స్వేచ్ఛ, ప్రతిపక్షాల హక్కులు, పౌర సమాజ భాగస్వామ్యం కూడా దాని పునాదులు. అధికారంలో ఉన్న పార్టీకి ప్రజలు మద్దతు ఇచ్చినంత మాత్రాన అపరిమిత అధికారాన్ని కట్టబెట్టినట్లు కాదు. ప్రభుత్వాలను ప్రశ్నించే హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకం.

**ప్రత్యామ్నాయ రాజకీయాలకు కొత్త బాధ్యత :** ప్రపంచవ్యాప్తంగా యువత, విద్యార్థులు, పౌర సమాజ సంస్థలు రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించడం మరో ముఖ్యమైన పరిణామం. అవినీతి, నిరుద్యోగం, సామాజిక అసమానతలు, విద్యా ప్రమాణాలు, ప్రజాసేవల నాణ్యత వంటి అంశాలపై యువత ప్రశ్నలు సంధిస్తోంది. అయితే ఉద్యమాలు, నిరసనలు మాత్రమే శాశ్వత పరిష్కారం కావు. వాటిని సమర్థవంతమైన విధానాలుగా, ప్రజలకు ఉపయోగపడే పాలనా కార్యక్రమాలుగా మార్చగలిగినప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుంది.


ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులు అధికార పార్టీలను విమర్శించడానికే పరిమితం కాకుండా ప్రజల సమస్యలకు ఆచరణ సాధ్యమైన పరిష్కారాలను చూపాలి. ప్రజా వనరుల వినియోగంలో పారదర్శకత, ఉపాధి కల్పన, నాణ్యమైన విద్య, వైద్యం, సామాజిక భద్రత, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

ప్రపంచ రాజకీయాల్లో వస్తున్న మార్పుల అంతరార్థం ఒక్కటే. అధికారాన్ని సంపాదించడం కంటే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం కష్టం. బలమైన నాయకత్వం, ఆకర్షణీయమైన నినాదాలు కొంతకాలం ప్రజలను ప్రభావితం చేయవచ్చు. కానీ వారి ఆర్థిక కష్టాలు, ఉపాధి సమస్యలు, సామాజిక అసమానతలు, ప్రజాస్వామ్య ఆకాంక్షలను నిరంతరం విస్మరించడం సాధ్యం కాదు. బ్రెజిల్ నుంచి సెర్బియా వరకు, ఇజ్రాయిల్ నుంచి అమెరికా వరకు కనిపిస్తున్న పరిణామాలు ప్రజాస్వామ్యానికి ప్రజలే అంతిమ నిర్ణేతలని గుర్తుచేస్తున్నాయి. ఎన్నికల విజయం అంతిమ లక్ష్యం కాదు.. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే పాలనకు అసలైన పరీక్ష. ప్రపంచ రాజకీయాలు కొత్త మలుపు తిరుగుతున్నాయా అన్న ప్రశ్నకు కాలమే సమాధానం చెప్పవచ్చు. కానీ ప్రజల ఆకాంక్షలను విస్మరించే అధికారాలకు భవిష్యత్తులోనూ సవాళ్లు తప్పవన్నది మాత్రం స్పష్టమైన సందేశం.

---

### 16 ఏళ్లకే పరిణతి..

# చట్టాలూ మారాల్సిందేనా?




- మారుతున్న సమాజం.. మారుతున్న బాల్యం.. నేరాల విషయంలో బాధ్యత, శిక్ష, సంస్కరణలపై పునరాలోచన అవసరం
- బాల నేరస్థుల వయోపరిమితిని 18 నుంచి 16 ఏళ్లకు తగ్గించే అంశాన్ని పరిశీలించాలన్న కేరళ హైకోర్టు.. దేశవ్యాప్తంగా చర్చకు తెరలేపిన కీలక వ్యాఖ్యలు

సమాజం వేగంగా మారుతోంది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ మనిషి జీవన విధానంతో పాటు ఆలోచనా విధానం కూడా మారుతోంది. ఒకప్పుడు పెద్దలకు మాత్రమే తెలిసిన అనేక విషయాలు నేడు చిన్నారులకు సైతం అందుబాటులోకి వస్తున్నాయి. ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్రపంచం పిల్లల ఆలోచనా పరిధిని విస్తృతం చేస్తున్నాయి. అయితే ఈ పరిజ్ఞానం ఎంత వేగంగా పెరుగుతోందో, దానికి అనుగుణంగా విచక్షణ, బాధ్యత, నైతిక విలువలు పెరుగుతున్నాయా అన్నది ఇప్పుడు సమాజం ముందున్న ప్రశ్న.

ఈ నేపథ్యంలో కేరళ హైకోర్టు చేసిన కీలక వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. బాల నేరస్థులు, చట్టంతో సంఘర్షణలో ఉన్న పిల్లలకు సంబంధించిన చట్టాల్లో మార్పులు చేసి, వారి వయోపరిమితిని 18 ఏళ్ల నుంచి 16 ఏళ్లకు తగ్గించే అంశాన్ని శాసనసభలు పరిశీలించాల్సిన సమయం ఆసన్నమైందని న్యాయస్థానం అభిప్రాయపడింది. 16 ఏళ్ల వయసుకే పిల్లల్లో తగినంత పరిణతి కనిపిస్తున్న ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని జస్టిస్ ఎ. బదరుద్దీన్ సూచించారు.

కేరళలో మద్యం సేవించిన యువకుల ప్రమేయంతో చోటుచేసుకున్న ప్రాణాంతక రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో దాఖలైన రిట్ పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ముఖ్యంగా 23 ఏళ్లలోపు వారికి మద్యం విక్రయించడం, సరఫరా చేయడంపై కేరళ అబ్కారీ చట్టంలోని నిబంధనలు అమలుకాకపోవడంపై పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి మైనర్లకు మద్యం అందిస్తున్న బార్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంలో ఎక్సైజ్ అధికారుల బాధ్యత, అమలు యంత్రాంగం పనితీరుపైనా న్యాయస్థానం దృష్టి సారించింది.

మైనర్లకు మద్యం సులభంగా అందుబాటులోకి రావడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ప్రాణాంతక ప్రమాదాలకు కారణమవుతున్న ఘటనలను న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. చట్టాలు ఉన్నప్పటికీ వాటి అమలులో లోపాలు ఉంటే ప్రజల ప్రాణాలకు ముప్పు తప్పదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. సంబంధిత చట్ట నిబంధనల అమలుపై నివేదిక సమర్పించాలని ఎక్సైజ్ కమిషనర్‌ను ఆదేశించిన హైకోర్టు, తదుపరి విచారణను నవంబర్ 24కు వాయిదా వేసింది.

ఇక్కడ ప్రధానంగా చర్చించాల్సింది వయోపరిమితి తగ్గింపే కాదు.. మారుతున్న బాల్యాన్ని, పెరుగుతున్న సామాజిక సవాళ్లను చట్టాలు ఏ మేరకు ప్రతిబింబిస్తున్నాయన్నది.

భారతదేశంలో ప్రస్తుతం అమల్లో ఉన్న జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) చట్టం ప్రకారం 18 ఏళ్లలోపు వారిని పిల్లలుగానే పరిగణిస్తారు. అయితే 16 నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్న బాలుడు హేయమైన నేరానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నప్పుడు, అతని మానసిక, శారీరక సామర్థ్యం, నేర పరిణామాలను అర్థం చేసుకునే స్థాయిని జువెనైల్ జస్టిస్ బోర్డు ప్రాథమికంగా అంచనా వేసే ప్రత్యేక విధానం ఇప్పటికే చట్టంలో ఉంది. అందువల్ల 16 ఏళ్లకు వయోపరిమితి తగ్గించాలన్న హైకోర్టు వ్యాఖ్యలను ప్రస్తుత చట్టంలో మార్పుగా భావించకూడదు. ఇది శాసనసభలు పరిశీలించాల్సిన సూచన మాత్రమే.

నేటి బాల్యం గత తరాల బాల్యంతో పోలిస్తే భిన్నమైనది. సాంకేతికతతో పాటు హింసాత్మక కంటెంట్, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల ప్రభావం, ఆన్‌లైన్ వ్యసనాలు వంటి ప్రమాదాలు కూడా పిల్లల జీవితాల్లోకి ప్రవేశిస్తున్నాయి. తల్లిదండ్రుల పర్యవేక్షణ తగ్గడం, కుటుంబ వ్యవస్థలో మార్పులు, విద్యాసంస్థల్లో ఒత్తిడి, చెడు స్నేహాలు వంటి అంశాలు కూడా బాలల ప్రవర్తనపై ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పిల్లలకు వయసుకు తగిన అవగాహన, బాధ్యత, క్రమశిక్షణ నేర్పించడం అత్యవసరం.

అయితే 16 ఏళ్ల వయసులోనే ప్రతి బాలుడు నేరానికి సంబంధించిన పరిణామాలను పూర్తిగా అర్థం చేసుకోగలడని భావించడం కూడా సరికాదు. శారీరక ఎదుగుదల, మానసిక పరిణతి రెండూ ఒకే వేగంతో జరగవు. కుటుంబ నేపథ్యం, సామాజిక పరిస్థితులు, మానసిక స్థితి, పరిసరాల ప్రభావం ఒక్కో బాలుడిపై ఒక్కో విధంగా ఉంటుంది. అందువల్ల వయోపరిమితి తగ్గింపు అంశాన్ని భావోద్వేగాల ఆధారంగా కాకుండా శాస్త్రీయ అధ్యయనాలు, బాలల మనస్తత్వ నిపుణుల అభిప్రాయాలు, న్యాయ నిపుణుల సూచనలు, అంతర్జాతీయ అనుభవాల ఆధారంగా పరిశీలించాలి.

నేరం చేసిన బాలుడికి బాధ్యత నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వడం ఎంతవరకు సమంజసమో, అతని బాల్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా పెద్దల మాదిరిగా శిక్షించడం ఎంతవరకు న్యాయమో కూడా సమాజం ఆలోచించాలి. నేర తీవ్రతను బట్టి బాధితులకు న్యాయం జరగాలి. అదే సమయంలో నేరానికి దారితీసిన పరిస్థితులను గుర్తించి, బాలల్లో మార్పు తీసుకురావడానికి పునరావాసం, కౌన్సెలింగ్, విద్య, మానసిక సహాయం అందించాలి.

మరో ముఖ్యమైన అంశం మద్యం విక్రయాల నియంత్రణ. చట్టం నిషేధించిన వయసులో ఉన్నవారికి మద్యం అందకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది. లైసెన్స్ పొందిన బార్లు, మద్యం విక్రయ కేంద్రాలు వయోపరిమితి నిబంధనలను కచ్చితంగా పాటించాలి. ఆధార్ లేదా ఇతర చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాల ఆధారంగా వయసు నిర్ధారణకు డిజిటల్ విధానాలను అమలు చేయడాన్ని పరిశీలించాలి. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అధికారుల నిర్లక్ష్యం ఉన్నా బాధ్యత నిర్ణయించాలి.

నేరం జరిగిన తర్వాత శిక్ష విధించడం కంటే నేరం జరగకుండా నిరోధించడం మరింత ముఖ్యం. పాఠశాలల్లో చట్టపరమైన అవగాహన, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాలు, డిజిటల్ క్రమశిక్షణపై ప్రత్యేక బోధన అవసరం. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో వస్తున్న మార్పులను గమనించాలి. విద్యాసంస్థలు కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలి.

కేరళ హైకోర్టు వ్యాఖ్యలు బాల న్యాయ వ్యవస్థపై మరోసారి సమగ్ర చర్చకు అవకాశం కల్పించాయి. చట్టాలు కాలానుగుణంగా సమీక్షించబడాలి. అయితే మార్పుల పేరుతో బాలల హక్కులు, రక్షణ, పునరావాసం వంటి ప్రాథమిక సూత్రాలు దెబ్బతినకూడదు. బాధితులకు న్యాయం, నేరస్థులకు తగిన బాధ్యత, బాలలకు సంస్కరణకు అవకాశం.. ఈ మూడింటి మధ్య సమతుల్యత ఉండాలి.

బాల్యం అనేది రక్షించాల్సిన దశ.. బాధ్యత అనేది నేర్పించాల్సిన విలువ.. నేరం అనేది నిరోధించాల్సిన ప్రమాదం. శిక్ష ఒక్కటే పరిష్కారం కాదు, సంస్కరణ ఒక్కటే సరిపోదు. న్యాయం, బాధ్యత, పునరావాసం సమన్వయంతోనే సురక్షితమైన సమాజాన్ని నిర్మించగలం. కేరళ హైకోర్టు వ్యాఖ్యలు దేశం ఈ దిశగా ఆలోచించాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తుచేస్తున్నాయి.

# వాతావరణ మార్పులకు కారణం..

## - సిలికాన్ ఫోటో వోల్టాయిక్ సోలార్ ప్యానల్..
## - వెల్లడించిన డాక్టర్ ఇబ్రహీం గణేష్..




**హైదరాబాద్, నవంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** నేడు మానవ జనిత సిఓ 2 వాయువు కంటే సిలికాన్ ఫోటో వోల్టాయిక్ సోలార్ ప్యానల్ ఎక్కువగా వాతావరణ మార్పులు కారణం అవుతుందని డాక్టర్ ఇబ్రహీం గణేష్ ఫౌండేషన్ సైంటిస్ట్ డాక్టర్ ఇబ్రహీం గణేష్ చెప్పారు.. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ కు కచ్చితంగా దోహదపడుతుందని చెప్పారు.. ఒక మాధ్యమంగా పనిచేస్తుంది దీని వలన నేరుగా భూతాపం కలగదని వాతావరణం లోని సిఓ2 వాయువు పెరగడం ఉండదని ఆయన తెలిపారు.. సోలార్ ప్యానెల్ లు అధిక మొత్తంలో పెద్ద వేడిని విడుదల చేస్తున్నాయని ఆయన చెప్పారు. వాతావరణంలో ఉన్న సిఓటు వాయువుతో తీవ్రమైన గ్లోబల్ వార్మింగ్ కు కారణం అవుతుందని ఆయన తెలిపారు. సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ఈ అతి పెద్ద సమస్యను పరిష్కరించడానికి మార్గాలు ఉన్నాయని ఆయన తెలిపారు. భూమి ఉపరితరానికి చేరే సూర్యరశ్మిలో 70 శాతం గ్రహిస్తుందని ఆయన చెప్పారు. 20 శాతం విద్యుత్తును 30 శాతం ఉష్ణ శాతం ఉత్పత్తి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. మానవ సమాజం ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించడానికి తగిన మార్గాలు అందుబాటులోకి వచ్చాయని ఆయన తెలిపారు. సూర్యరశ్మి నుంచి డీజిల్ పెట్రోల్ చేయడానికి అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పారు.. పర్యావరణానికి అదే సమయంలో మీరు చేయవచ్చునని ప్రకృతి స్పష్టంగా చూపిస్తుందని ఆయన తెలిపారు. సోలార్ ప్యానల్ వల్ల ఉపయోగం ఉందని ఆయన చెప్పారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలి

## - ప్రభుత్వాన్ని కోరిన గౌతమ్‌దీపక్, యాడ్ ఫిల్మ్ మేకర్..




**హైదరాబాద్, నవంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :**
బాలల దినోత్సవం సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించే ప్రత్యేక కార్యక్రమంపైన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని గౌతమ్ దీపక్, యాడ్ ఫిల్మ్ మేకర్ కోరారు.. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజువారీ రహదారి భద్రతా ప్రమాదాల గురించి ప్రజలలో తక్షణ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.. సమాజ మంతటా కఠినమైన ట్రాఫిక్ క్రమ శిక్షణను పెంపొందించడం జరగాలని అన్నారు. ప్రతిరోజూ, ఎలాంటి హెచ్చరిక లేకుండా ప్రాణాలను బలిగొనే ఘోరమైన రోడ్డు ప్రమాదాలను మనం చూస్తున్నాము. జీవితం అనూహ్యమైనది, ఈ రోజుల్లో, రోడ్డుపైకి అడుగు పెట్టడం లేదా పనికి వెళ్లడం అనేది సురక్షితంగా ఇంటికి తిరిగి వస్తామనే గ్యారెంటీని ఇవ్వదు.. తరచుగా ఇది మన నిర్లక్ష్యం వల్ల కాదు, ఇతరుల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగానే జరుగుతుంది. మన దైనందిన జీవితంలో పెరుగుతున్న ఈ అడ్డంకులను పరిష్కరించడానికి బాధ్యతాయుత తమైన సంస్కృతిని పెంపొందించడానికి, సమాజంలో ట్రాఫిక్ నియమాలు భద్రతా నిబంధనలను అలవర్చడానికి మేము బాలల దినోత్సవం సందర్భంగా ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. ఈ కీలకమైన కార్యక్రమంలో పాలుపంచుకుని, దానిని కవర్ చేయవలసిందిగా ముద్రణ, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధు లందరినీ ఆయన కోరారు.. మీ కవరేజ్ ఈ సందేశాన్ని సమాజపు నలుమూలలకూ విస్తరింపజేస్తుంది. సామాజిక ఆలోచనా విధానంలో ఒక చిన్న మార్పు వేలాది ప్రాణాలను కాపాడగలదు. మన రహదారులను అందరికీ అవగాహన కల్పించాలని గౌతమ్‌దీపక్ కోరారు..

# విద్యతోనే ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలి

## - రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి.



**జల్‌పల్లి నవంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :**
భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరిం చుకుని ఏటా నవంబరు 14న మన దేశంలో బాలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న సందర్భముగా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని నాదార్గుల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల మరియు అంగన్వాడీ కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి సందర్శించారు. ఈ సందర్భంగా భారత తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకొని, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. 5వ తరగతి ఆంగ్ల బోధనను పరిశీలించిన అదనపు కలెక్టర్ ఉపాధ్యాయులు బోధనోపకరణాలను (టీఎల్ఎమ్) సమర్థవంతంగా వినియోగిస్తూ పాఠాన్ని చక్కగా బోధించడాన్ని అభినందించారు. విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొని, అడిగిన ప్రశ్నలకు చక్కని సమాధానాలు ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అలాగే కనీస అభ్యసన సామర్థ్యాలు సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక సామర్థ్యాలు పెంపొందేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల విద్యాధికారి ఎం. కృష్ణయ్య, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సత్తయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# చిలకలగూడలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

## - విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన టీమ్ వి ఫర్ ఫౌండేషన్ ప్రతినిధులు



**సికింద్రాబాద్, నవంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్ పరిధిలోని చిలకలగూడ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో టీమ్ వి ఫర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్. రామ్,చైర్మన్ ఎస్.భానుమతి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ మిఠాయిలను పంచిపెట్టి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎస్.రామ్ మాట్లాడుతూ.నేటి బాలలే రేపటి పౌరులని,విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ,పట్టుదలతో విద్యనభ్యసిస్తూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో దేశ అభివృద్ధికి,సమాజ సేవకు తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఫౌండేషన్ చైర్మన్ ఎస్.భానుమతి మాట్లాడుతూ.పిల్లలే దేశ భవిష్యత్తుకు అసలైన సంపదని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడంతో పాటు సమాజంలోని నిరుపేదలకు చేతనైన సహాయం అందించే మంచి మనసును అలవర్చుకోవాలని సూచించారు.విద్యార్థులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు అందించిన సహకారానికి పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,విద్యార్థుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున రెడ్డి,ఉపాధ్యాయులు మల్లీశ్వరి,నలేహ, షాహిన్సుల్తానా, నీలిమ,దివ్య,కావేరితో పాటు ఫౌండేషన్ ప్రతినిధులు హనుమంతరావు, టి.నరేష్, ఎస్.అశ్విన్, రాజేష్,మంజుల,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# నవభారత్ పబ్లిక్ స్కూల్లో ఘనంగా క్రీడా దినోత్సవ వేడుకలు

## - విద్యార్థుల మార్చ్‌ఫాస్, క్రీడా ప్రదర్శనలతో సందడిగా మారిన పాఠశాలప్రాంగణం - క్రీడా జెండాను ఆవిష్కరించిన సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్

**పాల్వంచ నవంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణంలోని నవభారత్ పబ్లిక్ స్కూల్లో 47వ వార్షికక్రీడా దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎన్‌వికె.ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ అధికారి సిద్ధార్థ్‌విక్రమ్‌సింగ్, ఎంఈఓ శ్రీరామ్‌మూర్తి పాల్గన్నారు. పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్, హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ముఖ్య అతిథులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల సమక్షంలో వేదికపైకి సాదరంగా ఆహ్వానించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకోని భారత తొలిప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళ్లుఅర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ బాలలదినోత్సవ ప్రాముఖ్యతను, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో విద్యా సంస్థల పాత్రను వివరించారు. అనంతరం స్కౌట్స్‌అండ్‌గైడ్స్, ఎన్‌సిసి విద్యార్థులతోపాటు పాఠశాలకు చెందిన ట్రైల్‌బ్లేజర్స్, క్రూసేడర్స్, వాయేజర్స్, పయనీర్స్ అనే నాలుగు హౌస్‌ల విద్యార్థులు క్రమశిక్షణతో నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థుల కవాతును తిలకిం చిన అతిథులు వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. విద్యా ర్థుల క్రమశిక్షణ,సమన్వయం, ప్రదర్శన ను అభినందించారు. అనంతరం సిద్ధార్థ్‌విక్రమ్ సింగ్ జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడా జెండాను ఆవిష్కరించి, క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. దీంతో పాఠశాలప్రాంగణం విద్యార్థుల కేరింతలు, ఉత్సాహంతో సందడిగా మారింది.



**విద్యార్థుల విజయాలను అభినందించిన అతిథులు..** 2025-26 విద్యాసంవత్సరంలో విద్యార్థులు విద్యా, క్రీడా, ఇతర రంగాల్లో సాధించిన విజయాలు, ప్రతిభా పాటవాలను ప్రిన్సిపల్ ముఖ్య అతిథులకు వివరించారు. విద్యార్థులు సాధించిన విజయాలను అతిథులు అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పయనీర్స్, వాయేజర్స్ హౌస్‌ల మధ్య కబడ్డీ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులు ఉత్సాహంగా, క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గని తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ క్రీడా విభాగాల్లో నిర్వ హించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యా ర్థులకు వారు బహుమతులు అందచేసి అభినం దించారు. ఈసందర్భంగా విక్రమ్‌సింగ్ మాట్లా డుతూ విద్యార్థుల జీవి తాల్లో చదువుతోపాటు క్రీడలు ఎంతో కీలక మైన పాత్ర పోషిస్తాయని, క్రీడలు శారీరక ధృడత్వాన్ని పెంపొం దించ డమే కాకుండా క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్ష ణాలు, పట్టుదల, జట్టుగా పని చేసే మనస్తత్వాన్ని అలవర్చు తాయన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో ముందుకుసాగాలని విద్యార్థులకు సూచించారు. విద్యా ర్థుల్లో దాగిఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతోపాటు వారి ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ, పోటీతత్వాన్ని పెంపొం దించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థుల ఉత్సాహం, మార్చ్‌ఫాస్ట్, క్రీడాపోటీలు, బహుమతుల ప్రధానంతో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి.

# బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలకు తగినట్లు ఓవర్ బర్డెన్‌ను తొలగించాలి

## - కొత్తగూడెం లీజియన్‌లోని నాలుగు ఏరియాలకు సిఎండి ఆదేశం

**కొత్తగూడెంసింగరేణి నవంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణి మొత్తం మీద అత్యధిక బగ్గునుఉత్పత్తి చేస్తున్న కొత్తగూడెం రీజియన్ (కొత్తగూడెంఏరియా, సత్తుపల్లి, ఇల్లందు, మణుగూరు ఏరియాలో)లక్ష్యాలకు తగిన విధంగా ఓవర్ బర్డెన్ తొలగించాలని దీనికి అనుగుణంగా ఏజెన్సీలవారు తగిన సంఖ్యలో యంత్రాలను, మానవ వనరులను సమకూర్చుకోవాలని సింగరేణిసంస్థ చైర్మన్, ఎండి బుద్ధప్రకాష్‌జ్యోతి ఆదేశించారు. హైదరాబాద్‌లోనిసింగరేణి భవన్‌లో ఆయన కొత్తగూడెంరీజియన్‌లోని పలుఓపెన్‌కాస్ట్ గనుల బొగ్గు ఉత్పత్తి, అందుకు అనుగుణంగా సాగుతున్నఓవర్‌బర్డెన్ తొల గింపు, బొగ్గు రవాణా తదితర అంశాలపై ఆయా ఏరియాల జిఎంలు, ఓబి తొలగింపు ఏజెన్సీల ప్రతినిధులతో శనివారం సుదీర్ఘంగా సమీక్షించారు.ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో సింగరేణి సంస్థ ప్రతిరోజు తెలంగాణ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు 75వేల టన్నుల బొగ్గును సరఫరా చేయాల్సి ఉంటుందని, అదే సమయంలో సింగరేణితో ఇంధన సరఫరా ఒప్పందం ఉన్న విద్యుత్‌కేంద్రాల అవసరాలకు బొగ్గురవాణా చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకు అనుగుణంగా బగ్గు ఉత్పత్తి సాధించాలంటే ఓబర్‌బర్డెన్‌తొలగింపు నిర్దేశిత లక్ష్యాల మేర జరగాలని స్పష్టంచేశారు. ప్రతీరోజు నిర్దేశించిన లక్ష్యం మేరకు ఓవర్‌బర్డెన్ తొలగిస్తేనే దాని కింద ఉన్నబగ్గును ఉత్పత్తిచేసే అవకాశం ఉందని తెలిపారు. బగ్గుఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం అన్ని ఏరియాలు కలిపి రోజుఉ 14.15లక్షలక్యూబిక్‌మీటర్ల ఓవర్ బర్డెన్‌ను ప్రతీరోజు తొలగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సత్తుపల్లి ఏరియాలో రోజుకు 50వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాలని, ఇందుకోసం రోజుకు 2.4లక్షల క్యూబిక్‌మీటర్ల ఓవర్ బర్డెన్ తొల గించాలన్నారు. మణుగూరు ఏరియాలో రోజు ఉ 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాలని, ఈ లక్ష్యాల సాధనకోసం రోజు కు 2.25లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్‌బర్డెన్‌ను తొలగించేలా ప్రణాళి కాబద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. ఇల్లందు ఏరియాలో రోజుకు 5వేల టన్నుల బొగ్గు ఉత్పత్తిచేయాలని, 10వేలక్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలన్నారు. భద్రతతో కూడినబగ్గు ఉత్పత్తి, నాణ్యతతో కూడిన బొగ్గు రవాణాకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. వచ్చే కొద్ది నెలల్లో కాంట్రాక్టు కాలపరిమితి ముగియనున్న గనులకుసంబంధించిన అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఆయా గనుల కోసం కొత్త కాంట్రాక్టు ప్రతిపాదనలను త్వరితగతిన రూపొందించి,అవసరమైన అనుమతులుపొందాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈసమావేశంలో సింగరేణి అధికారులు ఎల్‌వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, తిరుమలరావు, బి.వెంకన్న, టి.శ్రీనివాస్, దేవేందర్, వెంకట రమణ, దుర్గం రాంచందర్, వెంకటాచారి, కృష్ణయ్య, సంబంధిత గనుల అధికారులు, ఓవర్‌బర్డెన్ కాంట్రాక్టర్‌లు పాల్గొన్నారు.




# విషవాయువులతో ప్రజల ప్రాణాలతో చెలగాటం

## డంపింగ్‌యార్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి
## అధికారుల నిర్లక్ష్యంతో రోగాల భారిన పడుతున్నాం
## నివాసాల మధ్య చెత్త డంప్ చేయడం దుర్మార్గం : రమేష్



**కొత్తగూడెం నవంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** డంపింగ్‌యార్డ్ నుండి వెలువడుతున్న విష వాయువులతో స్థానికప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని బాధితుడు కోట రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగూడెం మున్సిపల్, కార్పొరేషన్ పరిధిలోని 11వడివిజన్‌జనావాసాలకు సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డు వద్ద శనివారంస్థానికులు చెత్త వాహనాలను అడ్డుకోనిధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెంటౌన్‌పరిధిలోని 29 డివిజన్ల చెత్తను నిత్యం భారీ మొత్తంలో ఇక్కడికి తరలిస్తున్నారని, కనీస రక్షణ చర్యలు లేకపోవడంతో చెత్త తడిసినప్పుడు నిప్పు పెట్టినప్పుడుతీవ్రమైన విషవాయువులు వెలువడుతున్నాయని తెలిపారు. ఈకాలుష్యం వల్లశ్వాసకోశ వ్యాధులు, చర్మవ్యాధులు, విషజ్వరాల భారిన పడి స్థానికులు ఆసుపత్రుల పాలవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లుచెత్త వాహనాలను అడ్డుకుంటే పోలీసులతో ఆందోళనను విరమింపచేసి, రక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చి అధికారులుచేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఇప్పటికైనా తాత్కాలిక హామీలుకాకుండా డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వతపరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. శాశ్వతపరిష్కారం చూపే వరకు వెనక్కి తగ్గేది లేదనిస్థానికులు తెగేసిచెప్పడంతో చెత్త వాహనాలను వెనక్కి తీసుకెళ్లి కార్పొరేషన్‌కార్యాలయ ఆవరణలోనే చెత్తతోపాటునిలిపివేయడం గమనార్హం.సమస్యను పరిష్కరించకుండా వాహనాలను ఆఫీసు ఆవరణలో ఉంచడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.

# గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలు

## ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు
## బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారుల కళారూపాలు : మేయర్ గణేష్




**కొత్తగూడెం నవంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌మూడ్ గణేష్ అన్నారు. చాచా నెహ్రూ జయంతిని పురస్కరించుకోని బాలల దినోత్సవంసందర్భంగా జిల్లాకేంద్ర గ్రంథాలయ ఆవరణలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారంఘనంగాప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికిఆయన పాల్గొని చాచా నెహ్రూ, గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్.రంగనాధన్‌చిత్రపటాలకు పూలమాలలువేసి జ్యోతి ప్రజ్వలన చేసిమాట్లాడారు. చదువు మనిషి జీవితాన్ని మారుస్తుందని పేదవారు మేధావులుగా గొప్పవారిగా అవతరిస్తారన్నారు. దేవాలయంవంటి గ్రంథాలయ ఆవరణలో మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని మంచిపుస్తకాలు చదవడం ద్వారా మానసిక ఉల్లాసం చేకూరుతుందన్నారు. అనంతరంగ్రంథాలయ చైర్మన్‌పసుపులేటి వీరబాబుమాట్లాడుతూ చిన్నారులు, చిన్ననాటి నుండిపుస్తక పఠనానిన అలవర్చుకోవాలని, గ్రంథాలయాన్ని తమ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులుపలు సాంస్కృతికకార్యక్రమాలను ప్రదర్శించారు. జిల్లాగ్రంథాలయాల కార్యదర్శి కె.కరుణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ హరిత,గ్రంథపాలకురాలు ఎస్.లలితకుమారి, జి.మణిమృదుల, శాఖగ్రంథపాలకులు సిహెచ్.శ్రీనివాస్, నాగన్న,రవి, మధుబాబు, వాణి గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పై సమావేశం

**పాలేరు, నవంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** కూసుమంచి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల ప్రత్యేక అధికారి తుంబూరు సునీల్ రెడ్డి అధ్యక్షతన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పై ఎంపీడీఓ జస్వంత్ కుమార్,తహశీల్దార్ సైదులు,ఎంపీఓ హనుమంతరావు సమక్షంలో సర్పంచులు,కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ జస్వంత్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 19 వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం ప్రారంభమవుతుందని తెలిపారు.పథకం ప్రారంభం అనంతరం ప్రతి కుటుంబం నుండి ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని,మిగిలిన కుటుంబ సభ్యులలో ఒకరు (భార్య లేదా పిల్లలు) నామినిగా ఉంటారని చెప్పారు.ప్రమాదవశాత్తు దరఖాస్తుదారుడు చనిపోతే ఆ కుటుంబం రోడ్డున పడకుండా ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలను చేయూతగా బాధిత కుటుంబానికి అందిస్తుందని వెల్లడించారు.ఈ పథకానికి ఆధార్ కార్డు ప్రకారం దరఖాస్తుదారుడికి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉండాలని,నామినికి ఎలాంటి వయస్సు అవసరం లేదని,తెలంగాణ రాష్ట్రంలో పుట్టిన వారు మాత్రమే అర్హులని అన్నారు.పథకం ప్రారంభం తర్వాత అన్ని గ్రామపంచాయితీల్లో గ్రామసభలు



పెట్టి,ప్రతి 50 ఇండ్లకు ఇద్దరు అధికారులతో ఒక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులను తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.ఈకార్యక్రమంలోఆయాగ్రామాలసర్పంచులు,కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను విమర్శించే అర్హత అంబటికి లేదు

## - సబ్ కాంట్రాక్టు పేరిట రూ.35 లక్షల వసూలు..
## వ్యక్తిగత ఖాతాల్లోకి కార్మికుల వేతనాలు
## - దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి
## - నెలకంటి రాము సవాల్

**గోదావరిఖని, నవంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌పై విమర్శలు చేసే స్థాయి, అర్హత అంబటి నరేష్‌కు లేదని ఆర్ఎఫ్‌సీఎల్ అలైడ్ యూనియన్ అధ్యక్షుడు, కార్పొరేటర్ నెలకంటి రాము పేర్కొన్నారు.శనివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబటి నరేష్ తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.కార్మికుల సమస్యలు,వారి వేతనాల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌పై నిందలు వేయడం సరికాదని నెలకంటి రాము అన్నారు.కార్మికుల జీతాలకు సంబంధించిన సొమ్మును కాంట్రాక్టర్ల ద్వారా ప్రతినెలా తన వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయించుకొని అంబటి నరేష్ కార్మికులను మోసం చేశారని ఆయన ఆరోపించారు. సబ్ కాంట్రాక్టు ఇప్పిస్తానని చెప్పి రూ.35 లక్షలు తీసుకున్నట్లు తమ వద్ద పక్కా ఆధారాలు




ఉన్నాయని ఈసందర్భంగా వెల్లడించారు. అలాగే, బూడిద లారీలను అడ్డుకొని డబ్బులు డిమాండ్ చేశారని,అడిగిన మొత్తం ఇవ్వక పోవడంతోనే ఎమ్మెల్యేపైవిమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు. వ్యక్తిగత ప్రయోజనాలకోసం కార్మికుల పేరును అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడం తగదని ఆయన హితవు పలికారు.అంబటి నరేష్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే తనపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ వద్ద ఉన్న ఆధారాలతో ఆయన అక్రమాలను బహిర్గతం చేస్తామని అన్నారు. ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసే ముందు తన వ్యవహారాలపై స్పష్టత ఇవ్వాలని,దమ్ముంటే బహిరంగచర్చకు రావాలని సవాల్ విసిరారు. కార్మికుల ప్రయోజనాల పేరుతో వ్యక్తిగతంగా లబ్ధి పొందాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని నెలకంటి రాము హెచ్చరించారు.

# ప్రతి పిల్లవాడిని పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తుకు పునాదిరాలు వేసేది తల్లిదండ్రులే ;గ్రామ సర్పంచ్ ఏల్గని ప్రభాకర్ గౌడ్.

**రాజేంద్రనగర్, నవంబరు 15(జర్నలిస్ట్ ఫైల్):** ప్రతి ఒక్క చిన్నారులను పాఠశాలల్లో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించే బాధ్యత తల్లిదండ్రులదే అని సుల్తాన్ పల్లి గ్రామ సర్పంచ్ ఏల్గని ప్రభాకర్ గౌడ్ తెలిపారు. శ నివార ం శంషాబాద్ మండలం సుల్తాన్ పల్లి గ్రామంలో బాలల దినోత్స వని పురస్కరించుకొని బాలల కోసం ప్రత్యేక గ్రామ సభ ఏర్పా టుచేసి బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరి గిందని గ్రామ సర్పంచ్ ఏల్గని ప్రభాకర్ గౌడ్ సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులకు చదువు ప్రాముఖ్యత,విద్యాభివృద్ధి,భవిష్యత్తు లక్ష్యాలకు సంబంధించి పలు సూచనలు,సలహాలు తెలియజేశారు.విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాం క్షించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దండు శివ కుమార్,వార్డు సభ్యులు మనీషా జనార్దన్, రాజు గౌడ్,జగన్,నర్సింగ్ ముదిరాజ్,స్వప్న సిద్దయ్య,గ్రామ కార్యదర్శి,ఆశ వర్కర్లు,గ్రామ పంచాయతీ సిబ్బంది,నాయకులు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.బా లలే రేపటి భవిష్యత్తు వారి విద్యే సమాజ అభివృద్ధికి పునాది అన్నారు.



# పండ్ల మార్కెట్‌కు గ్రహణం!

- **ఐదేళ్లుగా హామీలే.. పనులు అసంపూర్తి!**

**వరంగల్, నవంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వాలు మారుతున్నా పండ్ల మార్కెట్ వ్యాపారులు, రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ విమర్శిం చారు. అసంపూర్తిగా ఉన్న మార్కెట్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.శనివారం వరంగల్ పండ్ల మార్కెట్‌ను బీజేపీ నాయకులు, వ్యాపారు లతో కలిసి సందర్శించిన ఆయన సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మార్కెట్‌ను కూల్చివేసి కొత్త నిర్మాణాన్ని అసంపూ ర్తిగా వదిలేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో 4.16 ఎకరాల్లో రూ.24 కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణంలో పండ్ల వ్యాపారుల కోసం హామీ ఇచ్చిన 85 గదుల పనులు కూడా పూర్తికాలేదన్నారు. సరైన షెడ్లు, మౌలిక సదుపాయాలు లేక వ్యాపారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్మాణ పనులు పూర్తి చేసి, వ్యాపారులకు గదులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వ్యాపారుల పక్షాన బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పండ్ల మార్కెట్ అధ్యక్షుడు వెల్ది సాంబయ్య, గౌరవ అధ్యక్షుడు మల్లారెడ్డి, మార్కెట్ వ్యాపార కమిటీ సభ్యులు, మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జలగం రంజిత్ రావు, రత్నం సతీష్ షా, గురుమూర్తి శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉప్పట్ల పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

**మంథని, నవంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** బాలల దినోత్సవాన్ని పురస్కరించు కుని మంథని మండలం ఉప్పట్ల గ్రామంలోని ఎ ం. పి. యు. పి. ఎ స్. పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ గోదావరిఖని వాసవి ఆధ్వర్యంలో ఉచితంగా పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కాసిపేట వెంకటమ్మ మాట్లాడుతూ విద్యార్థుల చదువుకు తోడ్పా టునందించేలా బ్యాగులు అందజేసిన లయన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు రాహుల్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి భవిష్యత్తులోనూ తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. బ్యాగులు అందుకున్న విద్యార్థులు సంతోషం వ్యక్తం చేయగా, పాఠశాల ప్రధానోపాధ్యా యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, లయన్స్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# పండిట్ జవహర లాల్ నెహ్రూ 137 వ జయంతి వేడుక

**ఖమ్మం, నవంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో భారతదేశ తొలి ప్రధాని స్వర్గీయ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 137 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించినైనది*జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారా యణ గౌడ్ శ్రేణులతో కలిసి స్వర్గీయ శ్రీ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు అలంకరించి, ఘన నివాళులు అర్పించినారుశనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారా యణ గౌడ్ గారి అధ్యక్షతన స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ 137 వ జయంతిని పురస్కరిం చుకొని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అర్బన్ జిల్లా కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి,శాసనసభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వ రరావు, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న,జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు,దొబ్బల సౌజన్య, మొక్క శేఖర్ గౌడ్,సయ్యద్ ముజాహిద్ హుస్సేన్,ఆసిఫ్ అలీ, గ్రంధి ప్రవీణ్ లు మరియు జిల్లా కాంగ్రెస్ కమిటీ,కార్పొరే షన్ కమిటీ సభ్యులు మరియు శ్రేణులతో కలిసి స్వర్గీయ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించినారుఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ గ మాట్లాడుతూ స్వర్గీయ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ భారతదేశ తొలి ప్రధాని,ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులుగా,ఆధునిక భారత నిర్మాణ శిల్పి అని , నెహ్రూ గారికి పిల్లలు అంటే అమితమైన ప్రేమ అని అందుకే ఆయన పుట్టిన రోజు బాలల దినోత్సవంగా జరుపు కొంటామని అన్నారు.మహాత్మ గాంధీ త్యాగం మరియు పోరాటం పిలుపుతో నెహ్రూ స్వాతంత్ర్య ఉద్యమంలో అడుగుపెట్టినారని, దేశ విముక్తి కొరకు ఎన్నో ఏళ్లుజైలు జీవితం గడిపారని,కులమతాలకు,అతీతంగా అందరికి సమాన హక్కులు ఉండాలని తద్వారా సామాజిక న్యాయం జరుగుతుందని,ఆధునిక భారత నిర్మాణం కోసం దేశం అభివృద్ధి చెందాలంటే విద్యా మరియు సాంకేతిక రంగాలను అభివృద్ధి చేయాలనే ధృడ సంకల్పంతో సైన్స్ మరియు టెక్నాలజీ ఎంతో అవసరమని నేడు ప్రఖ్యాతి గాంచిన ఐ ఐ టి (IIT) వంటి విద్యాసంస్థలకు పునాది వేశారని,రై తుల సంక్షేమం, దేశ ప్రగతి కోసం భారీ నీటి పారుదల ప్రాజెక్టులను నిర్మించారని వాటిని ఆధునిక భారత దేవాలయాలుగా అభివర్ణిం చారు. అదే విధంగా ప్రజాస్వామ్యం మరియు లౌకికవాదం భారతదేశం ఒక బలమైన ప్రజాస్వామ్య , లౌకిక దేశంగా నిలబడటానికి ఆయన వేసిన పునాదులే నేటికి మనల్ని నడిపి స్తున్నాయన్నారు.స్వర్గీయ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆధునిక భారతదేశం కోసం బంగారు బాటలు వేశారని వారి సేవలను కొని యాడుతూ వారి ఆశయసాధనకు కృషి చేయాలని మనం అందరం వారు చూపిన బాటలో నడుస్తూ, వారి ఆశయాలను కొనసా గించటమే మనం వారికిచ్చే నిజమైన ఘన నివాళులు అని, దేశ ఐక్యతను కాపాడుతూ పేదరిక నిర్మూలనకు,ప్రజాస్వామ్య పరిరక్షణకు మనందరం కట్టుబడి పనిచేద్దాం అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారా యణ గౌడ్ అన్నారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు కిలారు అనిల్ కుమార్, కొట్టే రాజశేఖర్, కొట్టే రాజశే ఖర్, గాదెల ఝాన్సీ,బండి మాధవరావు, బచ్చ లకూర, వసీం,ఫజల్ , పోతగాని రమణ, నాగరాజు, పంది రాజు గౌడ్, అల్లే సాయి,ప్రతి భారెడ్డి,అన్నపూర్ణ, దామా స్వరూప తదితర నాయకులు పాల్గొన్నారు.



# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- **విద్యార్థులకు అవగాహన కల్పించిన కేశంపేట ఎస్సై పరమేష్**

**కేశంపేట, నవంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యార్థులు చిన్నతనం నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, మంచి లక్ష్యాలను ఏర్పరచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కేశంపేట ఎస్సై పరమేష్ సూచించారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరిం చుకొని శనివారం కేశంపేట మండలంలోని నిడుదవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే ఆరోగ్యం దెబ్బతిన డంతో పాటు భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని తెలిపారు.అదేవిధంగా గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులను నమ్మవద్దని సూచించారు. ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని చెప్పారు. సోషల్ మీడియాలో అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, సైబర్ మోసాలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను అలవర్చుకొని మంచి పౌరులుగా ఎదగాలని ఎస్సై ఆకాంక్షిం చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఉపసర్పంచ్ సపూరా ఆమేర్, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, వార్డు సభ్యులు నాగరాజు, చంద్రయ్య, రమేష్ నాయక్, రిజ్వానా బేగం మోహిజ్, వెంకటమ్మ, మల్లయ్య, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బడ్డ మల్లయ్య, నాయకులు డాక్టర్ ఆంజనేయులు, ముత్యాలు, బద్రుద్దీన్, జంగయ్య, ఖాజాపాషా, వాజీద్, శేఖర్ అప్ప, మల్లేష్, వహీద్, సాజిత్, అశోక్, సాయి పాఠశాలల ఉపాధ్యాయులు కరుణాకర్, విజయ్ కుమార్, లత, నిర్మల, భూదేవి, అరుణకుమారి, రజిత, కృష్ణారెడ్డి, అంగన్వాడి టీచర్లు ప్రేమలత, సులోచన, జయమని, ఆశ వర్కర్లు కరుణ, సంగీత, గ్రామ యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# మధుమేహంపై అప్రమత్తతే ఆరోగ్యానికి అసలైన రక్షణ!

- **తపాలాపూర్‌లో ఉచిత షుగర్,బీపీ పరీక్షలు.**
- **ప్రజలకు వైద్య అవగాహన.**
- **30 ఏళ్లు దాటిన వారిపై ప్రత్యేక దృష్టి.**
- **షుగర్ బాధితులకు పీహెచ్‌సీకి రిఫరల్.**

**జన్నారం, నవంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** మధుమేహాన్ని ముందుగానే గుర్తించి, ప్రమాదకర ఆరోగ్య సమ స్యలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా జన్నారం మండలం తపాలాపూర్ గ్రామంలో శనివారం ఉచిత మధుమేహ, రక్తపోటు పరీక్షలతో పాటు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమ లాకర్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఉచితంగా రక్తంలో చక్కెర స్థాయిలు,బీపీ పరీక్షలు నిర్వహించారు.ముఖ్యంగా 30 ఏళ్లు పైబడిన వారు,వృద్ధులకు ప్రత్యేకంగా పరీక్షలు చేసి,రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉన్న వారిని గుర్తించి తదుపరి వైద్య పరీక్షలు,చికిత్సల కోసం పీహెచ్‌సీ జన్నారంకు రిఫర్ చేశారు.ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ మధుమేహం అంటే ఏమిటి,టైప్-1, టైప్-2 మధుమేహం మధ్య తేడాలు,వ్యాధి రావ డానికి గల కారణాలు,ప్రారంభ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తరచూ మూత్ర విసర్జన,అధిక దాహం,ఆకలి, నీరసం,గాయాలు ఆలస్యంగా మానడం,కాళ్లలో తిమ్మిర్లు,కంటి చూపు మసకబారడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.మధుమేహ నియంత్రణకు ఆహారపు అలవాట్లలో మార్పులు తప్పనిసరని, ఉప్పు,నూనె,తీపి పదార్థాల వినియోగాన్ని తగ్గించాలని, ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేయాలని తెలిపారు. సమయానికి భోజనం చేయడంతో పాటు వైద్యుల సూచన మేరకు మందులు క్రమం తప్పకుండా వాడాలని,మద్యం, పొగాకు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.మధుమేహం ఉన్నవారు నిర్లక్ష్యంతో మందులు మానేయకుండా క్రమం తప్పకుండా షుగర్ పరీక్షలు చేయించుకోవాలని, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి నియం త్రణలో ఉంచుకుంటే అనారోగ్య సమస్యల ముప్పును తగ్గించుకో వచ్చని పేర్కొన్నారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే పీహెచ్‌సీ జన్నారంను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.



## లిక్విడ్ గంజాయి విక్రయిస్తున్న ఎనిమిది మంది అరెస్ట్



- 440 గ్రాముల లిక్విడ్ గంజాయి, 44 ప్లాస్టిక్ టిన్లు, నాలుగు కూల్‌డ్రింక్ బాటిళ్లు స్వాధీనం

**గుంటూరు, నవంబరు 15(జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరులో లిక్విడ్ గంజాయి విక్రయిస్తున్న ఎనిమిది మంది యువకులను పాత గుంటూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 440 గ్రాముల లిక్విడ్ గంజాయి ఉన్న 44 ప్లాస్టిక్ టిన్లు, నాలుగు మినిట్ మేడ్ పల్పీ ఆరెంజ్ కూల్‌డ్రింక్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 14న సాయంత్రం బాలాజీనగర్ మొదటి లైన్‌లోని వెంకటేశ్వర నిలయం అపార్ట్‌మెంట్ రెండో అంతస్తులోని ఓ అద్దె ఫ్లాట్‌లో లిక్విడ్ గంజాయి నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పాత గుంటూరు పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో ఆకస్మిక దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు.

కారుమూరి సన్నీ డేనియల్, కొక్కు శ్యామ్ సుందర్, బండి వంశీకృష్ణ, షేక్ ఫణీంద్ర, తన్నీరు ప్రదీప్, అల్లాబకాష్ ఓవైస్ రజా, తాళ్లపురెడ్డి హరినాథ్ రెడ్డి, గడ్డం గంగాధర్‌లను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 295/2026 కింద ఎన్డీపీఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్లతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు ఈస్ట్ డీఎస్పీ టి. సీతారాం మాట్లాడుతూ.. ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలో గంజాయి విక్రయం, వినియోగం, సరఫరాను అరికట్టేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈగల్ బృందంతో సమన్వయం చేసుకుంటూ మాదకద్రవ్యాల కార్యకలాపాలపై నిఘా కొనసాగిస్తామని చెప్పారు. గంజాయి కేసుల్లో గతంలో నిందితులుగా ఉన్నవారి కదలికలను కూడా పరిశీలిస్తూ, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించిన నేపథ్యంలో ఈ దాడులు నిర్వహించినట్లు పోలీసులు వెల్లడించారు.

## నేడు అప్పిరెడ్డితో సజ్జల ములాఖాత్



**గుంటూరు, నవంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్):** అక్రమ కేసులో అరెస్టై గుంటూరు సబ్ జైల్లో ఉన్న శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డిని ములాఖాత్ ద్వారా కలిసేందుకు సోమవారం ఉదయం వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి గుంటూరు రానున్నట్లు పార్టీ లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోలూరి వెంకటరెడ్డి వెల్లడించారు. ఆయనతో పాటు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం కూడా లేళ్ళ అప్పిరెడ్డితో ములాఖాత్ అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో అప్పిరెడ్డి అభిమానులు హాజరవుతారని పోలూరి వివరించారు.

## విద్యార్థి దశలో ప్రతి అవకాశాన్ని ఒడిసిపట్టుకోండి

- పోటీ ప్రపంచానికి అనుగుణంగా సిద్ధమవ్వండి
- సేవా సంస్థల సహకారాన్ని సద్వినియోగం చేసుకోండి
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఉచిత శిక్షణ ప్రారంభం



**గుంటూరు, నవంబరు 15(జర్నలిస్ట్ ఫైల్ ):** తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు మీ చుట్టూ ఉన్న అన్ని వనరులను సద్వినియోగం చేసుకొని, విద్యను ఆయుధంగా మలుచుకుని ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎమ్ఎమ్ఎస్) పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత కోచింగ్ శిక్షణ తరగతులను ఆదివారం స్థానిక ఏసీ కళాశాలలో ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానవతా సేవా సంస్థ రక్తదానం, అవయవ దానం వైద్య శిబిరాలు వంటి అనేక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూనే రెండేళ్లుగా ఎన్ఎమ్ఎమ్ఎస్ సిద్ధమయ్యే విద్యార్థులకు ఉచిత కోచింగ్ శిక్షణ అందిస్తోందని తెలిపారు.

విద్యార్థులు కేవలం అకడమిక్ పుస్తకాలకే మాత్రమే పరిమితం కాకుండా పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేందుకు ఎలా సిద్ధం అవ్వాలో తెలుసుకోవాలన్నారు. ఎన్ఎమ్ఎమ్ఎస్ ద్వారా 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతి ఏటా 12 వేల రూపాయలు స్కాలర్‌షిప్ అందుతుందని చెప్పారు. ఎన్ఎమ్ఎమ్ఎస్ ప్రతిభ పరీక్షలో పోటీ అధికంగా ఉంటుందని విద్యార్థులు ఆలోచనాత్మకంగా సిద్ధమవ్వాలని సూచించారు. ఇంజనీర్లు, డాక్టర్లు, కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులుగా ఎదుగుతారని సూచించారు. క్రమశిక్షణ, ఏకాగ్రత, లక్ష్యసాధన ఉంటే విజయం సొంతమవుతుందని చెప్పారు.

రాష్ట్రంలో తల్లికి వందనం ద్వారా ఇంట్లో చదువుకునే ప్రతి ఒక్కరికీ 15 వేల రూపాయల అందిస్తున్నామని, విద్యార్థుల తల్లిదండ్రులకు భారం లేకుండా చూస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలబెట్టాలనే ఆలోచనతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నాయని చెప్పారు. విద్యార్థి దశలో వచ్చే ప్రతి అవకాశాన్ని ఒడిసిపట్టుకోవాలని, అప్పుడే మంచి పౌరులుగా ఎదుగుతారని అన్నారు.

## కార్తీక సోమవారం.. పెదకాకాని ఆలయం వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు

- భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు
- జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**గుంటూరు, నవంబరు 15(జర్నలిస్ట్ ఫైల్ ):** కార్తీక మాసం ఆదివారం, సోమవారం సందర్భంగా పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో జిల్లా పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసింది. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టింది.

బందోబస్తు విధులకు హాజరైన పోలీస్ సిబ్బందికి పెదకాకాని ఎస్ఐ రామకృష్ణ ప్రత్యేకంగా విధులపై బ్రీఫింగ్ నిర్వహించారు. భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించడం, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ.. కార్తీక సోమవారం సందర్భంగా జిల్లాలోని ప్రధాన శివాలయాల వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా తిరిగి వెళ్లేలా అన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. భక్తులు పోలీసులకు సహకరించాలని, ట్రాఫిక్ నియమాలు, పోలీసుల సూచనలు పాటిస్తూ స్వామివారిని ప్రశాంతంగా దర్శించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## బ్రహ్మంగారి జయంతి మహోత్సానికి ఎమ్మెల్యే పుట్టాకు ఆహ్వానం



**ప్రొద్దుటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** జగద్గురు శ్రీమద్విరాట్ వీర బ్రహ్మేంద్ర స్వామి మఠం నందు స్వామి వారి జయంతి మహోత్సానికి మఠాధిపతి శ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వామి వారి ఆదేశాలమేరకు మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ని జయంతి మహోత్సానికి రావాలని మేనేజర్ పిపిఎన్ ప్రసాద్,మఠాధిపతి సోదరుడు దత్తాత్రేయ స్వామి ప్రొద్దుటూరులోని తన స్వగృహం కి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారి మఠం మండల సీనియర్ నాయకులు ఎస్. ఆర్. శ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కడప జిల్లా అవోపా నూతన అధ్యక్షుడిగా మేడం దినేష్ కుమార్ ఏకగ్రీవ ఎన్నిక

- మైదుకూరులో ఘనంగా జిల్లా అవోపా సర్వసభ్య సమావేశం - 11 యూనిట్ల ప్రతినిధుల హాజరు



**మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్ ):**కడప జిల్లా ఆర్యవైశ్య ఆఫీసర్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) సర్వసభ్యసమావేశం ఆదివారం మైదుకూరులోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశం జిల్లా అవోపా కార్యకలాపాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించడంతో పాటు నూతన జిల్లా అధ్యక్షుడి ఎన్నికకు వేదికగా నిలిచింది. మైదుకూరు అవోపా అధ్యక్షులు దరిశా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మాజీ అధ్యక్షులు గూడూరు హరికృష్ణ, అవోపా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిట్టెం రమేష్, రాష్ట్ర సలహాదారు సి.ఏ. ప్రసాద్, కృష్ణదేవరాయ రీజియన్ కన్వీనర్ దరిశా వెంకట అన్వేష్, ప్రముఖ వైద్యులు మాలేపాటి వెంకటరామ్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. జిల్లాలోని 11 యూనిట్లకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు, ఇతర బాధ్యులు (PST) పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ యూనిట్ల ప్రతినిధులు తమ తమ యూనిట్ల పరిధిలో చేపట్టిన సేవా, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమావేశంలో వివరించారు. ఆయా యూనిట్ల పనితీరు, సంఘటనా బలోపేతం, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అభిప్రాయాలను పంచుకున్నారు.

మాజీ అధ్యక్షులు గూడూరు హరికృష్ణ గత రెండేళ్లుగా జిల్లా అవోపా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతి, సంఘం అభివృద్ధికి చేపట్టిన ప్రత్యేక చర్యలను వివరించారు. ఆయన అందించిన సేవలను పలువురు అభినందించారు.

**ఏకగ్రీవంగా నూతన అధ్యక్షుడి ఎన్నిక**

సమావేశంలో అత్యంత కీలక ఘట్టంగా జిల్లా అవోపా నూతన అధ్యక్షుడి ఎన్నిక జరిగింది. పులివెందుల యూనిట్ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న శ్రీ మేడం దినేష్ కుమార్ను కడప జిల్లా అవోపా నూతన అధ్యక్షుడిగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మైదుకూరు ఆర్యవైశ్య సభ అధ్యక్షులు బల్లాని చెన్నకేశవ ప్రసాద్ నూతన ఆవోప జిల్లా అధ్యక్షుడిని అభినందించారు ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మేడం దినేష్ కుమార్‌కు సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ యూనిట్ల ప్రతినిధులు, సభ్యులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో జిల్లా అవోపా మరింత అభివృద్ధి సాధించాలని, ఆఫీసర్లు, ప్రొఫెషనల్స్ ఐక్యతను బలోపేతం చేస్తూ సేవా కార్యక్రమాల్లో కొత్త ఒరవడిని సృష్టించాలని ఆకాంక్షించారు. జిల్లాలోని 11 యూనిట్ల ప్రతినిధులు ఒకే వేదికపై సమావేశమై సంఘం ప్రగతి ఐక్యత భవిష్యత్ లక్ష్యాలపై చర్చించడం ఈ సమావేశం ప్రత్యేకతగా నిలిచింది. నూతన అధ్యక్షుడి ఏకగ్రీవ ఎన్నికతో సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.

## తుఫాను వస్తోంది... అప్రమత్తంగా ఉండాలి

- 19న 18 సెంటీ మీటర్ల వర్షపాతం అంచనా
- 18, 19, 20 తేదీల్లో వర్షాలు
- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాట
- శిథిలావస్థలో ఉన్న భవనాల వద్దకు ఎవరు వెళ్ళవద్దు
- వాగులు, వంకలు, నదులు దాటువద్దు, చేపలు పట్టుటకు వెళ్ళరాదు



**గుంటూరు, నవంబరు 15(జర్నలిస్ట్ ఫైల్ ):** రానున్న తుఫాన్ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో సహా మండల స్థాయి కార్యాలయం వరకు కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 08632234014 ఫోన్ నంబర్ తో కంట్రోల్ రూమ్ పనిచేస్తుందన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల వద్దకు ఎవరు వెళ్ళవద్దని, అందులో ఎవరు నివసించరాదని విజ్ఞప్తి చేశారు. చెరువులు, వాగులు, వంకల వద్దకు ఎవరు వెళ్ళవద్దని, దాటుటకు ప్రయత్నించవద్దని కోరారు. తడిగా ఉన్న కరెంటు స్తంభాలను ముట్ట వద్దని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సియం.సాయికాంత్ వర్మ వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. "టీం గుంటూరు"గా తుఫానుపై విజయం సాధించాలని పిలుపునిచ్చారు. వాయుగుండం మరింత బలపడి తుఫానుగా మారుతుందన్నారు. నవంబరు 18 నుండి వర్షాలు కురిసే అవకాశం ఉందని,19వ తేదీన 18 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు కాగలదని అంచనా ఉందని, 20వ తేదీన వర్షాలు కురుస్తాయని ఆర్.టి.జి.ఎస్ సూచనలు జారీ చేసిందని చెప్పారు. అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల వివరాలు గుంటూరు నగరపాలక సంస్థ, ఇతర మున్సిపాలిటీలలో సిద్ధం చేసి చేపట్టాల్సిన చర్యలను సమీక్షించాలని ఆదేశించారు. గాలులకు హోర్డింగులు, చెట్లు కూలిపోయే పరిస్థితి ఉంటుందని, వాటిని తొలగించాలని ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాలు, అండర్ పాస్ ల వద్ద నీరు నిలువ ఉండే అవకాశం ఉందని, ఆ ప్రాంతాల్లో ముందుగానే ఆయిల్ ఇంజిన్ లు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు

జలవనరుల శాఖ ప్రతీ వాగు, కాలువలను ముఖ్యంగా నల్లమడవాగు, కొండవీటివాగు తదితర వాగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రకాశం బ్యారేజీ నీటి నిల్వలు, వివిధ వాగుల ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని జలవనరుల శాఖను ఆదేశించారు. ఎక్కడైతే గట్లు బలహీనంగా ఉన్నాయో వాటిని గుర్తించాలని, అటువంటి చోట్ల ఇసుక బస్తాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అర్నాబ్, మురసు తుఫాన్లకు గండిపడిన చోట్ల వెంటనే ఇసుక బస్తాలు వేసి పూడ్చాలని ఆదేశించారు.

పరిస్థితిని అనుసరించి తక్షణం ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.

ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పూర్తి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పురపాలక సంఘాలు, గ్రామాల్లో సైతం తాగునీటి సమస్య తలెత్త రాదని అన్నారు. తాగునీటి పథకాలు వద్ద జనరేటర్లు సిద్ధంగా పెట్టుకోవాలని ఆదేశించారు. త్రాగునీరు ఎటువంటి పరిస్థితుల్లో కలుషితం కాకుండా స్పష్టమైన పర్యవేక్షణ జరగాలని అన్నారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం వలన రవాణాకు ఆటంకం జరక్కుండా ట్రీ కట్టర్స్, పవర్ సాస్ లను సిద్ధంగా పెట్టాలని రహదారులు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖలను ఆదేశించారు. విపత్తు నిర్వహణ శాఖ అన్ని పరికరాలతో సిద్ధంగా ఉండాలని చెప్పారు. విద్యుత్తు స్తంభాలు కూలితే వెంటనే పునరుద్ధరణ చేసి విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని ఆదేశించారు. తాడికొండ వద్దగల 220 కెవి, ఇతర ప్రాంతాల్లో ఉన్న 33 కెవి సబ్ స్టేషన్ ల వద్ద నీరు చేరి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

టెలికాం, మొబైల్ సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా సంబంధిత టెలికం కంపెనీలు ముందస్తుగానే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జిల్లాలో అన్ని బంకుల్లో ఇంధనం పూర్తిస్థాయిలో ఉండే విధంగా పర్యవేక్షణ చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. చౌక ధరల దుకాణాల్లో నిత్యావసర సరుకులు పూర్తిస్థాయిలో అందుబాటులో పెట్టాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల వద్ద ఆహార తయారీ కోసం ఏజెన్సీలను సిద్ధం చేసి తక్షణ ఆహార పంపిణీకి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుఫాన్ పట్ల రైతులను అప్రమత్తం చేయాలని అవసరమైన సూచనలు సలహాలను అందించాలని వ్యవసాయ ఉద్యానవన శాఖలను ఆదేశించారు. పశువులకు సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు వాటికి తగిన ఆహారము అందే విధంగా పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**ఆసుపత్రుల వద్ద విద్యుత్ ఆటంకం లేకుండా చూడాలి**

ఆసుపత్రుల వద్ద ముఖ్యంగా అత్యవసర వైద్య సేవలు, ఆపరేషన్ థియేటర్ల వద్ద ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. హై రిస్క్‌లో ఉన్న గర్భిణీ స్త్రీలను ముందుగానే ఆసుపత్రులకు తరలించాలని ఆదేశించారు. వైద్య సేవలకు ఎటువంటి అంతరాయము ఉండరాదని స్పష్టం చేశారు.

**వాగులు, వంకలు, నదులు దాటవద్దు**

వాగులు, వంకలు, నదులు ఎవరు దాటవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుఫాను తీవ్రత ఉండటం, నీటి ప్రవాహాలు పెరగటం జరుగుతుందని చెప్పారు. జల ప్రవాహాలు దగ్గర ఈతకు వెళ్లడం, సాధారణ పనులు చేయుటకు వెళ్లడం ఉండరాదని, దీనిపట్ల గ్రామాల్లో దండోరా వేయించి తెలియజేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కడ మనుషుల ప్రాణాలు గానీ, పశువుల ప్రాణాలు గానీ, ఆస్తుల నష్టంగాని జరగరాదని స్పష్టం చేశారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ,జిల్లా రెవిన్యూ అధికారి ఎన్. ఎస్. కె. ఖాజావలి, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తాడికొండ 220 కేవీ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన జేసీ



- తుఫాను నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలపై సమీక్ష

**గుంటూరు, నవంబరు 15(జర్నలిస్ట్ ఫైల్ ):** రానున్న తుఫాను నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలను పరిశీలించేందుకు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదివారం తాడికొండ 220 కేవీ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు.

ఈ నెల 18, 19, 20 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సబ్‌స్టేషన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యంగా ఈ నెల 19న సుమారు 18 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున సబ్‌స్టేషన్ పరిసరాల్లోకి వరద నీరు చేరకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

గతంలో వచ్చిన మురసు తుఫాను సమయంలో సబ్‌స్టేషన్ వద్ద భారీగా వరద నీరు చేరిన విషయాన్ని అధికారులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. అప్పట్లో నీటిని తొలగించేందుకు పంపింగ్ యంత్రాలను ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. రానున్న వర్షాల నేపథ్యంలోనూ వరద నీటిని త్వరితగతిన తొలగించేందుకు అవసరమైన యంత్రాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకటరత్నం, సీపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తుఫాన్ హెచ్చరిక.. గుంటూరు నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- అత్యవసర సహాయం కోసం జీఎంసీ కాల్ సెంటర్ ఏర్పాటు
- లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు

**గుంటూరు, నవంబరు 15(జర్నలిస్ట్ ఫైల్ ):** వాయుగుండం తుఫానుగా బలపడే అవకాశం ఉండటంతో ఈ నెల 18 నుంచి భారీ వర్షాలు కురిసే సూచనల నేపథ్యంలో గుంటూరు నగరపాలకసంస్థ అప్రమత్తమైంది. ఈనెల 19న సుమారు 18 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఆర్టీజీఎస్ హెచ్చరించిన నేపథ్యంలో జీఎంసీ కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. తుఫాను అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు జీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన 0863-2345103 కాల్ సెంటర్‌ను సంప్రదించాలని కమిషనర్ సూచించారు. అధికారులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నగరంలోని లోతట్టు, ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైతే అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. డ్రైనేజీల్లో నీరు నిలవకుండా పూడిక, అడ్డంకులను తొలగించాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలను ఖాళీ చేయించాలని, ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, నీటిని తోడే మోటార్లు, జనరేటర్లతో ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, రహదారులపై చెట్లు కూలిపోతే వెంటనే తొలగించేలా సిబ్బందిని అప్రమత్తం చేయాలని సూచించారు.

నగర ప్రజలు కూడా అధికారుల సూచనలు పాటించాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్లనుంచి బయటకు రావద్దని కమిషనర్ కోరారు. పాత భవనాలు, భారీ హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకూడదని హెచ్చరించారు. వదంతులను నమ్మకుండా ప్రభుత్వ అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని సూచించారు.

## శ్రీ చక్రం చర ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ మాధవరాయ ఆంజనేయ శ్రీ భీమేశ్వరి స్వామి దేవస్థానంలో నిర్వహించిన శ్రీ చక్రం చర ప్రతిష్ఠా మహోత్సవంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్ర మహేశ్వరి, శక్తిగురు గౌరవ మాతాజీ శ్రీ శ్రీ శ్రీ రమ్యానంద భారతి మహాస్వామి వారిని కలిసి ఆశీస్సులు పొందారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్కులేషన్ మేనేజర్
76 61 80 59 68

## తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చేలా చిన్నారుల ప్రదర్శన: మంత్రి దుర్గేష్



- రాజమహేంద్రవరంలో వెయ్యి మందికి పైగా చిన్నారులతో 'ఓం శివోహం' మహాబృంద నాట్యం

**రాజమహేంద్రవరం, నవంబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్)** : కళాకారులను, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఖ్రామరీ కూచిపూడి నాట్య నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఓం శివోహం.. కార్తీక మాస నృత్యోత్సవం-2026' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

నాట్య గురువు దాసం పావని నేతృత్వంలో వెయ్యి మందికి పైగా చిన్నారులు ప్రదర్శించిన మహాబృంద కూచిపూడి నాట్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. చిన్నారుల సమన్వయం, నృత్య నైపుణ్యం, కళా ప్రతిభకు ఆహూతుల నుంచి ప్రశంసలు లభించాయి.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇంత భారీ స్థాయిలో కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. మిరాకిల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకావడం ప్రత్యేకమని పేర్కొన్నారు. ఆయా సంస్థల గుర్తింపు పత్రాలు చిన్నారులకు మరింత ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు తెలుగు సంస్కృతి, కళలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

చిన్నారులు తమ కళా నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుని ఉన్నత స్థాయి కళాకారులుగా ఎదిగి రాష్ట్రానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. నిడదవోలు నియోజకవర్గంలో దాసం పావని నిరంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఇప్పుడు రాజమహేంద్రవరంలో ఇంతటి భారీ నృత్యోత్సవాన్ని నిర్వహించడం ప్రశంసనీయమని అన్నారు.

కళాకారుల అభివృద్ధికి, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం తరఫున అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు సాంస్కృతిక శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. చిన్నారులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు.

## గుంటూరులో ఘనంగా ముగిసిన ఏపీ హ్యాంఫెస్ట్ - 2026




- నాలుగు రాష్ట్రాల నుంచి 110 మంది హామ్ ఆపరేటర్లు, 120 మంది విద్యార్థుల భాగస్వామ్యం

**గుంటూరు, నవంబరు 15(జర్నలిస్ట్ ఫైల్ )**: గుంటూరులోని అమరావతి రోడ్డులో ఉన్న హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఆదివారం ఏపీ హ్యాంఫెస్ట్ – 2026 ఘనంగా నిర్వహించారు. హామ్ రేడియో సాంకేతికతపై విద్యార్థులు, యువతలో అవగాహన పెంపొందించడం, విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ సమాచార వ్యవస్థగా దాని ప్రాధాన్యతను చాటిచెప్పడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

గుంటూరు నగర మేయర్ కొవెలమూడి లక్ష్మీ అపర్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిఐటీ ఛాన్సలర్ శ్రీ వాసిరెడ్డి విద్యాసాగర్ ఎలక్ట్రానిక్స్, హామ్ రేడియో ప్రదర్శన స్టాళ్లను ప్రారంభించారు. డాక్టర్ మల్లెంపల్లి పెరుమాళ్లు, బైర్రెట్టి మల్లికార్జున రావు, కన్వీనర్ డాక్టర్ కాకాని పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి సుమారు 110 మంది హామ్ రేడియో ఆపరేటర్లు పాల్గొన్నారు. ఎనిమిది పాఠశాలలు, ఐదు కళాశాలలు, రెండు విశ్వవిద్యాలయాలకు చెందిన సుమారు 120 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. మేయర్ లక్ష్మీ అపర్ణ మాట్లాడుతూ, విద్యార్థులు ప్రదర్శించిన వినూత్న ప్రయోగాలు, సాంకేతిక నమూనాలు తనను ఆకట్టుకున్నాయని తెలిపారు. హామ్ రేడియోపై ఆసక్తి పెరిగిందని, తాను కూడా హామ్ ఆపరేటర్‌గా మారాలనే ప్రేరణ కలిగిందని అన్నారు. యువత ఇలాంటి శాస్త్రీయ, సాంకేతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

హామ్ రేడియో భవిష్యత్ తరాలకు చేరువ కావాలని, పాఠశాలలు, కళాశాలల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఇతర ప్రముఖులు అభిప్రాయపడ్డారు.

ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, యాంటెన్నా సాంకేతికత, శాటిలైట్ కమ్యూనికేషన్ తదితర అంశాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా విద్యార్థుల ప్రయోగాలు, నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విపత్తుల సమయంలో హామ్ రేడియో ద్వారా అత్యవసర సమాచార సేవలు అందించే విధానాలపై సాంకేతిక చర్చలు జరిగాయి.

ఈ సందర్భంగా హామ్ రేడియో రంగంలో విశేష సేవలందిస్తున్న 14 మంది సీనియర్ ఆపరేటర్లను ఘనంగా సత్కరించారు. అలాగే, గత మూడు నెలలుగా ఈ కార్యక్రమ విజయానికి కృషి చేసిన కో-కన్వీనర్ రామకృష్ణ, రమణమూర్తి, బాలసుబ్రహ్మణ్యం, అనువ ప్రసాదు, వేల్పూరి సీతారాములు, కుమారి ఝాన్సీ తదితర నిర్వాహకులను ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. అందరి సమిష్టి కృషి, సహకారంతో ఏపీ హ్యాంఫెస్ట్ – 2026 విజయవంతమైందని కన్వీనర్ డాక్టర్ కాకాని పృథ్వీరాజ్ తెలిపారు.

## గిరిబాబుతో ఇ.వి.వి యువ కళావాహిని ఎంతో అనుబంధం.

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)**: ప్రముఖ సినీ నటుడు నిర్మాత గిరిబాబు కు ఇ. వి. వి యువ కళావాహిని కి ఎంతో అనుబంధం ఉందని.. అటువంటి వ్యక్తి మృతి చెందటం విచారకరమని ఇ.వి.వి యువ కళావాహిని అధ్యక్షుడు, మాజీ సెన్సార్ బోర్డ్ సభ్యులు వెచ్చ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. తమ సంస్థ తరఫున గుంటూరు నగరంలో గిరిబాబును ఎన్నోసార్లు సత్కరించామన్నారు. గిరిబాబు చేత తాను సెన్సార్ బోర్డు సభ్యునిగా నియమితులైన సందర్భంలో సన్మానం చేయించుకోవటం తన జీవితంలో మరువలేనిదన్నారు. హాస్యనటుడిగా... క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా.. సినీ నిర్మాతగా గిరిబాబు తెలుగు సినీ అభిమానుల హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోతారన్నారు.

# గిరిజనుల ఆత్మగౌరవం, అస్తిత్వ పరిరక్షణకు మోదీ ప్రభుత్వం ప్రాధాన్యం

- మరుగునపడిన గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను వెలుగులోకి తెస్తున్నాం
- రాష్ట్రంలో 37 ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు
- జనజాతి గౌరవ దివస్ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్




**విజయవాడ, నవంబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్)**: గిరిజనుల ఆత్మగౌరవం, అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం విశేష ప్రాధాన్యత ఇస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించినప్పటికీ చరిత్రలో మరుగునపడిన గిరిజన సమరయోధుల త్యాగాలను నేటి తరానికి పరిచయం చేస్తున్నామని పేర్కొన్నారు. భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా ఆదివారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన జనజాతి గౌరవ దివస్ సభలో ఆయన ప్రసంగించారు. గిరిజన సమాజం తమ భాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఆత్మగౌరవంతో జీవించాలని బిర్సా ముండా తన పోరాటం ద్వారా చాటిచెప్పారని మాధవ్ అన్నారు. కేవలం 25 ఏళ్ల జీవితంలోనే బ్రిటిష్ పాలకులను ఎదిరించి గిరిజనుల హక్కుల కోసం ఉద్యమించిన గొప్ప విప్లవ వీరుడని కొనియాడారు. అల్లూరి సీతారామరాజుతో కలిసి పోరాడిన 326 మంది విప్లవ యోధులు, మంప విప్లవంలో పాల్గొన్నవారు, సెల్యులార్ జైలులో శిక్షలు అనుభవించిన గిరిజన పోరాట యోధుల చరిత్రను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ ప్రభుత్వం మరుగునపడిన స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను ప్రజలకు పరిచయం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. భీమవరంలో అల్లూరి సీతారామరాజు 35 అడుగుల విగ్రహాన్ని ప్రధాని ఆవిష్కరించారని, లంబసింగిలో గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను తెలియజేసే మ్యూజియం ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. కొమరం భీమ్, గంటం దొర, మల్లు దొర వంటి యోధుల పోరాటాలను నేటి తరానికి తెలియజేస్తున్నామని చెప్పారు. 2021 నవంబర్ 15న బిర్సా ముండా జయంతిని జనజాతి గౌరవ దివస్‌గా నిర్వహించాలని ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. గిరిజనుల విద్య, వైద్యం, ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఏకలవ్యమోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని, ఆంధ్రప్రదేశ్‌లో 37 ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాడేరులో 150 ఎంబీబీఎస్ సీట్ల సామర్థ్యంతో వైద్య కళాశాల ఏర్పాటు గిరిజన ప్రాంతాల వైద్య సేవలకు దోహదపడుతుందన్నారు.

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి హయాంలో తొలిసారిగా ప్రత్యేక గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేశారని మాధవ్ గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో బిర్సా ముండా ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ కృషి చేస్తోందని, గత ఏడాది పాడేరులో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించామని తెలిపారు. త్వరలో రంపచోడవరం, సీతంపేట ప్రాంతాల్లోనూ విగ్రహాల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని, బిర్సా ముండా పేరుతో స్టడీ సర్కిళ్లు నిర్వహించి గిరిజన యువతలో చైతన్యం తీసుకొస్తామని వెల్లడించారు. అన్ని వర్గాలను కలుపుకొని సమరస సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

**గిరిబాబు మృతికి సంతాపం:** ప్రముఖ సినీ నటుడు, బీజేపీ నాయకుడు గిరిబాబు మృతి పట్ల పీవీఎన్ మాధవ్ సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల ప్రచారంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారని గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, రాష్ట్ర హెడ్ క్వార్టర్స్ ఇన్‌ఛార్జ్ ఉప్పలపాటి శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రోటోకాల్ కన్వీనర్ పాతూరి నాగభూషణం, రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జ్ కిలారు దిలీప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లాకా వెంగళరావు, ముప్పల సుబ్బయ్య, సీనియర్ నాయకుడు పైలా సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఎన్జీజీఓ ఉచిత మెగా వైద్య శిబిరం






- 16న ఎన్జీవో కల్యాణ మండపంలో రిజిస్ట్రేషన్లు.. మహిళలకు 16 నుంచి 19 వరకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

**గుంటూరు, నవంబరు 15(జర్నలిస్ట్ ఫైల్ )**: గుంటూరు జిల్లా ఏపీఎన్జీజీఓ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకోసం ఈనెల 16న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. వేదాంత హాస్పిటల్స్ సౌజన్యంతో ఎన్జీవో కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం జరగనుంది. శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకోతో పాటు పలు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. డెంటల్, కంటి వైద్య సేవలు కూడా అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ ద్వారా ఏడాదికి ఒకసారి పూర్తి స్థాయి మాస్టర్ హెల్త్ చెకప్ చేయించుకునే సౌకర్యాన్ని వేదాంత హాస్పిటల్స్ కల్పించేందుకు ముందుకొచ్చింది. డీడీఓ ద్వారా సమ్మతి లేఖ అందజేస్తే ఈ పరీక్షలను క్రెడిట్ విధానంలో ఉచితంగా నిర్వహించనున్నారు. మహిళా ఉద్యోగుల కోసం అమెరికాకు చెందిన డాక్టర్ సమతా కడియాల ఆధ్వర్యంలోని పింక్ సొసైటీ వైద్య బృందం సహకారంతో ఈ నెల 16 నుంచి 19 వరకు గర్భాశయ ముఖద్వార, రొమ్ము క్యాన్సర్లకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు చేయించుకోవాలనుకునే మహిళా ఉద్యోగులు 16వ తేదీ ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య ఎన్జీవో కల్యాణ మండపంలో రిజిస్ట్రేషన్ చేసుకుని తమ స్లాట్లను బుక్ చేసుకోవాలని సంఘం కోరింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ, ఐఏఎస్, ఏపీఎన్జీజీఓ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ ఆలపర్తి విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ డి.వి.రమణ ప్రారంభించనున్నారు. గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని వైద్య పరీక్షలు చేయించుకోవాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి శ్యాం సుందర్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

## నామినేషన్లకు పోలీస్ ఎన్.ఓ.సీ., నో డ్యూస్ సర్టిఫికెట్లు తప్పనిసరి కాదు



- వాటి సమర్పణ లేదనే కారణంతో నామినేషన్లను తిరస్కరించరాదు

**గుంటూరు, నవంబరు 15(జర్నలిస్ట్ ఫైల్ )**: పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల రెండవ సాధారణ ఎన్నికలు--2026లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు సంబంధిత పోలీస్ స్టేషన్ల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు (చీజ), వివిధ ప్రభుత్వ శాఖల నుంచి నో డ్యూస్ సర్టిఫికెట్లు సమర్పించలేదనే కారణంతో నామినేషన్లను తిరస్కరించరాదని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అథారిటీ సీఎం సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆదివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలీస్ శాఖ నుంచి ఎన్.ఓ.సీ. లేదా ఏదైనా ప్రభుత్వ శాఖ నుంచి నో డ్యూస్ సర్టిఫికెట్ సమర్పించలేదనే కారణంతో రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ నామినేషన్లను తిరస్కరించరాదని స్పష్టం చేసిందన్నారు. నామినేషన్ల దాఖలు, పరిశీలనకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే జారీ చేసిన మార్గదర్శకాలను రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

## డయాబెటిస్‌పై నిర్లక్ష్యం వద్దు.. చిన్న గాయం కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- కాలు తొలగించుకునే పరిస్థితులు రాకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి: ఎమ్మెల్యే గళ్ళా మాధవి




**గుంటూరు, నవంబరు 15(జర్నలిస్ట్ ఫైల్ )**: డయాబెటిస్ పై ఏ మాత్రం నిర్లక్ష్యం వహించ వద్దని, చిన్న గాయం కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని లేకపోతే అది కాలు తొలగించుకునే పరిస్థితులు రావచ్చని, కాబట్టి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌లో నిర్వహించిన జాతీయ రక్తనాళాల ఆరోగ్య అవగాహన వాకథాన్ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ పాల్గొన్నారు. డయాబెటిస్ కారణంగా కాళ్లు తొలగించాల్సిన పరిస్థితులు రాకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో వాస్కులర్ సర్జన్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ కాలు తొలగింపు లేని గుంటూరు.. కాలు తొలగింపు లేని భారతదేశం లక్ష్యంగా గుంటూరులోని వాస్కులర్ సర్జన్లు చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమం అభినందనీయమని, డయాబెటిస్‌తో పాటు అనారోగ్యకరమైన జీవనశైలి, ఆరోగ్యంపై నిర్లక్ష్యం కారణంగా చాలామంది కాళ్లు తొలగించాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారు కాళ్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చిన్న గాయం అయినా, ఏదైనా ఇబ్బంది తలెత్తినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను, ముఖ్యంగా రక్తనాళాల శస్త్రచికిత్స నిపుణులను సంప్రదించాలని సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించకపోవడం కూడా సమస్య తీవ్రతకు కారణమవుతోందని పేర్కొన్నారు.

డయాబెటిస్ సమస్య విస్తృతంగా పెరుగుతున్నపేపథ్యంలో, బాధితుల్లో కొందరు కాలు తొలగించాల్సిన పరిస్థితులకు చేరుకుంటున్నారని తెలిపారు. సకాలంలో వైద్య పరీక్షలు, సరైన చికిత్స, ఆరోగ్యంపై అవగాహన ఉంటే ఇటువంటి పరిస్థితులను నివారించవచ్చని చెప్పారు.

కాలు కోల్పోవడం వల్ల వ్యక్తి తన దైనందిన జీవితంలో ఇతరులపై ఆధారపడాల్సి వస్తుందని, అది వారి ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసంపై ప్రభావం చూపుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని మహాభాగ్యంగా భావించి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షిస్తున్న సంతోషకరమైన, ఆరోగ్యకరమైన, సంపన్నమైన కుటుంబాల నిర్మాణంలో భాగంగా ప్రజలందరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు. లిలికాలు తొలగింపు లేని గుంటూరు.. కాలు తొలగింపు లేని భారతదేశంలిలి లక్ష్యాన్ని సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## రీసర్వే పనిభారం తగ్గించాలి.. రెవెన్యూ ఉద్యోగులకు తగిన సమయం, నిధులివ్వాలి

- లక్ష్యాల పేరుతో క్షేత్రస్థాయి సిబ్బందిపై ఒత్తిడి తగదు
- వేగంతో పాటు భూ రికార్డుల ఖచ్చితత్వం, నాణ్యతకు ప్రాధాన్యం
- శిథిలావస్థలోని తహసీల్దార్ కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించాలి
- పూర్తయిన 108 తహసీల్దార్, 8 రెవెన్యూ డివిజన్ కార్యాలయాలను వెంటనే అప్పగించాలి
- ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు




**విజయవాడ, నవంబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్)**: రాష్ట్రంలో రీసర్వే విధుల్లో నిమగ్నమైన రెవెన్యూ ఉద్యోగులపై పని ఒత్తిడిని తగ్గించి, క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా తగిన సమయం, నిధులు, సిబ్బందిని కేటాయించాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. లక్ష్యాల సాధన కోసం ఉద్యోగులపై ఒత్తిడి పెంచడం వల్ల గతంలో జరిగిన తప్పులు, పొరపాట్లు పునరావృతమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రీసర్వేలో వేగంతో పాటు భూ రికార్డుల ఖచ్చితత్వం, నాణ్యతకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం బొప్పరాజు అధ్యక్షతన నిర్వహించిన ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. రాష్ట్రంలోని 28 జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొని రెవెన్యూ శాఖలోని సమస్యలపై చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల విధులు, ఓటర్ల జాబితాల సవరణ, తుఫాను సహాయక చర్యలు, సెన్సస్ శిక్షణ, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ, పండుగలు, ప్రోటోకాల్ విధులు వంటి బాధ్యతలతో ఉద్యోగులు ఇప్పటికే తీవ్ర పనిభారాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. వీటికి అదనంగా రీసర్వే లక్ష్యాల పేరుతో ఒత్తిడి పెంచడం వల్ల ఉద్యోగులు మానసిక, శారీరక అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

రీసర్వే అనేది కేవలం ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేసే కార్యక్రమం కాదని, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించే కీలక ప్రక్రియ అని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్ నుంచి పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ వరకు వివిధ దశల్లో ఈ-కేవైసీ నిర్వహించాల్సి ఉండటంతో ఎక్కువ సమయం అవసరమవుతుందని వివరించారు. ముఖ్యంగా ఐదు, ఆరు దశల్లో చేపట్టిన గ్రామాలు సమస్యాత్మకమైనవిగా ఉండటంతో మరింత జాగ్రత్తగా సర్వే చేయాల్సి ఉందన్నారు. గతంలో నాణ్యత కంటే లక్ష్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పాస్‌పుస్తకాల్లో తప్పులు దొర్లాయని, అలాంటి పరిస్థితులు మళ్లీ తలెత్తకుండా చూడాలని కోరారు.

మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల భవనాలపై కూడా సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. గతంలో నిర్మాణాలు చేపట్టిన 108 తహసీల్దార్ కార్యాలయాలు, 8 రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు పూర్తయినప్పటికీ బిల్లులు, నిధుల విడుదలలో జాప్యం కారణంగా అధికారికంగా సంబంధిత శాఖలకు అప్పగించలేదని తెలిపారు. వీటి కోసం సుమారు రూ. 300 కోట్లకు పైగా నిధులు అవసరమని సీసీఎల్ఏ నివేదించినట్లు పేర్కొన్నారు. పూర్తయిన భవనాలను వెంటనే హ్యాండోవర్ చేయడంతో పాటు శిథిలావస్థలో ఉన్న కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఇటీవల భారీ వర్షాలు, తుఫానుల కారణంగా రాజోలు తహసీల్దార్ కార్యాలయంలోకి వరదనీరు చేరి రికార్డు గదులు, కార్యాలయ ప్రాంగణం దెబ్బతిన్నాయని తెలిపారు. కృష్ణా జిల్లా చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయ భవనం కూలిపోవడంతో సిబ్బందికి గాయాలయ్యాయని గుర్తుచేశారు. రెవెన్యూ కార్యాలయాల్లో భూ రికార్డులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, మ్యుటేషన్లు, ధ్రువీకరణ పత్రాలు వంటి కీలక పత్రాలు భద్రపరుస్తున్నందున భవనాల భద్రతకు తక్షణ చర్యలు అవసరమని పేర్కొన్నారు. రీసర్వే విషయంలో క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సాంకేతిక సహకారం, సిబ్బంది, నిధులు, తగిన గడువు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీఆర్ఎస్ఏ నాయకులు కోరారు. అలాగే శిథిలావస్థలో ఉన్న కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించి, పూర్తయిన భవనాలను వెంటనే అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల భద్రత, ప్రభుత్వ రికార్డుల పరిరక్షణ, ప్రజలకు నిరంతరాయంగా సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి కోరారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com